సంపుటి : 9
సంచిక : 356
శుక్రవారం
18 సెప్టెంబర్ 2026
పేజీలు : 12
వెల : 2/-

E-PAPER

# విశ్వం వాయిస్

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

10 YEARS CELEBRATING

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE




Contact For Ads:
7579339999

## దేశ ప్రయోజనాల కోసం

# ప్రధాని మోదీకి అండగా నిలవాలి



- ఎన్డీయే ఐక్యతే దేశానికి బలం
- మోదీ నాయకత్వంలో భారత్ అభివృద్ధి అన్ స్టాపబుల్
- వికెఎస్... ఇదే భారత్ అభివృద్ధి మంత్రం
- అయోధ్య రామమందిర నిర్మాణ కలను మోదీ నిజం చేశారు
- దేశంలో నదుల అనుసంధానం ప్రధాని మోదీతోనే సాధ్యం
- వామపక్ష తీవ్రవాదాన్ని అంతమొందించారు...
- ఆపరేషన్ సింధూర్‌తో భారత్ సత్తా చాటారు
- యూపీ ప్రభుత్వం అనుమతిస్తే అయోధ్యలో శ్రీవారి ఆలయ నిర్మాణం
- వారణాసి-వాద్నగర్ సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి
- ముఖ్యమంత్రి ప్రసంగానికి రక్షణ మంత్రి ఫిదా... వెరీ వెల్ అంటూ ప్రశంసలు
- శ్రీ కాశీ విశ్వనాధుని ఆలయంలో కేంద్ర మంత్రులు, యూపీ సీఎంతో కలిసి ముఖ్యమంత్రి ప్రత్యేక పూజలు

**వారణాసి, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** "రైట్ టైమ్.. రైట్ లీడర్ నరేంద్ర మోదీ. దేశాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కాదు.. దేశ ప్రయోజనాల కోసం ప్రధాని నరేంద్ర మోదీకి అండగా నిలవాలి. ఎన్డీఏ ఐక్యతే దేశానికి బలం" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల పాలనా ప్రస్థానాన్ని, ఆయన పుట్టిన రోజును పురస్కరించుకుని వారణాసిలో నిర్వహించిన వారణాసి-వాద్నగర్ సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాశీ-వాద్నగర్ సేవా యాత్రలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం సాధిస్తున్న ప్రగతిని, సంక్షేమం నుంచి సాంకేతికత వరకు చోటుచేసుకున్న మార్పులను ఆయన వివరించారు. అలాగే మోదీ నాయకత్వంలో దేశం ఏ విధంగా అభివృద్ధి చెందుతోందనే విషయాన్ని చెప్పారు. ఇక ఏపీకి కేంద్రం అందిస్తున్న సాయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎన్నటికీ



మరువలేమని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."కాశీ క్షేత్రం ప్రధాని నరేంద్ర మోదీ కర్మ భూమి. కాశీ పుణ్యక్షేత్రం నుంచి నరేంద్ర మోదీ మూడుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఇక్కడి ప్రజలు వారణాసికి నేతను ఎన్నుకోవడమే కాదు... దేశానికి ఓ లీడర్‌ను అందించారు. ప్రధాని నరేంద్ర మోదీ మిగతా .. 2లో..

## 25 ఏళ్ల నిస్వార్థ సేవ

### మోదీకి పుట్టినరోజు శుభాకాంక్షల వెల్లువ



**ఢిల్లీ, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధాని మోదీ హయాంలో దేశం ఎన్నో నూతన ప్రమాణాలను నెలకొల్పిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొనియాడారు. నేడు ప్రధాని పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. 25ఏళ్లుగా మోదీ చేసిన ప్రజా సేవలను ప్రస్తావిస్తూ సినీ, రాజకీయ ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

"ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు. గడిచిన 25 ఏళ్లలో ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా సుపరిపాలనను అందించారు. ఎన్నో నూతన ప్రమాణాలను నెలకొల్పారు. ఈ ప్రజా సేవను మరింతకాలం కొనసాగించేలా మీరు ఆరోగ్యంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా"

**- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**

"కర్తవ్యాన్నే సాధనగా, దేశసేవనే జీవిత ధ్యేయంగా మలుచుకుని సాగుతున్న మోదీ జీవితం కోట్ల మందికి స్ఫూర్తి. మీ నాయకత్వంలో దేశం ప్రగతిపథంలో నూతన శిఖరాలను అధిరోహించాలని.. 2047 నాటికి మిగతా .. 2లో..

## రాజకీయాల్లో

# హుందాతనానికి ప్రతీక నాని

### మంత్రి నారా లోకేష్ నివాళి



**ఏలూరు, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ ఉప ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ నేత ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) మరణం పట్ల రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మిగతా .. 2లో..

# తిరుమల పర్యటనకు విచ్చేసిన ఏపీ గవర్నర్ నజీర్

### శుక్రవారం శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకోనున్న గవర్నర్ - తిరుమలలో గవర్నర్‌కు స్వాగతం పలికిన టీటీడీ చైర్మన్, ఈవో రేణిగుంట విమానాశ్రయంలో స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్, ఎస్పీ



**తిరుమల, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ గురువారం తిరుమల చేరుకున్నారు. శ్రీవారి దర్శనార్థం తిరుమల విచ్చేసిన ఆయనకు తిరుమల తిరు పతి దేవస్థానం (టీటీడీ) అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. గవర్నర్ శుక్రవారం ఉదయం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోనున్నారు. వివరాల్లోకి వెళితే, గురువారం సాయంత్రం తిరుమలలోని శ్రీభాగ్య విశ్రాంతి భవనానికి చేరుకున్న గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు, కార్యనిర్వహణాధికారి (ఈవో) ఎం. రవిచంద్ర, సీవీఎస్‌వో మురలీకృష్ణ పుష్పగుచ్ఛం అందించి సాదరంగా స్వాగతించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు నరేశ్, రిసెప్షన్ అధికారులు భాస్కర్, సాత్రే నాయక్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు, రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న గవర్నర్‌కు జిల్లా ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు విమానాశ్రయంలో గవర్నర్‌కు స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ అబ్దుల్ నజీర్ రోడ్డు మార్గంలో తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

## పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి

# నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారు

### జగన్‌పై హోం మంత్రి అనిత ఫైర్
### డీఎస్సీ నియామకాలపై అసత్య ప్రచారాలు
### డీఎస్సీ పూర్తయిన ఏడాది తర్వాత బురద చల్లుతున్నారని ఆగ్రహం
### వాస్తవాలు ఏమిటో ప్రజలకు తెలుసని వ్యాఖ్య



**అమరావతి, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీలో డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలపై రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, టీడీపీ అధికార ప్రతినిధి అప్పసాని రాజేశ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. డీఎస్సీ ప్రక్రియ పూర్తయి ఏడాది గడిచిన తర్వాత, కూటమి ప్రభుత్వంపై బురద చల్లేందుకు వైసీపీ నాయకులు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని అనిత మండి పడ్డారు. వైసీపీ అధినేత జగన్ పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధారమైన వ్యాఖ్యలు చేయడం అలవాటుగా మిగతా .. 2లో..

## మాజీ ఎమ్మెల్యే కుటుంబం దీనగాథ తెలిశాక

# నా మనసు చలించింది

### తెలంగాణా రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి



**సూర్యాపేట, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** సూర్యాపేట జిల్లా సిరికొండలో దివంగత మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ కమ్యూనిస్టు నేత ఉప్పల మల్సూర్ కుటుంబ సభ్యులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఉప్పల మల్సూర్ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజల గొంతుకగా నిలిచారని.. రజాకార్ల నిరంకుశత్వానికి ఎదురొడ్డి పోరాడారని గుర్తుచేశారు. "జీవితాంతం ప్రజల మిగతా .. 2లో..

## మాజీ మంత్రి మల్లారెడ్డి కుటుంబానికి

# సొంత పార్టీలోనే బిగ్ షాక్

- ప్రీతిరెడ్డి ఫ్లెక్సీల చించివేత • పార్టీ అధిష్ఠానాన్ని బేఖాతరు చేస్తున్నారంటూ మండిపాటు
- కేసీఆర్, కేటీఆర్ ఫొటోలు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారంటూ పార్టీ శ్రేణుల ఆగ్రహం




**హైదరబాద్, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత చామకూర మల్లారెడ్డి కోడలు డాక్టర్ ప్రీతిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా మేడ్చల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు మిగతా .. 2లో..

## అమెరికా నుంచి 100% టారిఫ్ ముప్పు..

# భారత్ రియాక్షన్ ఇదే



**సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాల ఎగుమతులపై 100 శాతం టారిఫ్‌లకు వీలుకల్పించే బిల్లుకు అమెరికా చట్టసభల్లో ఆమోదం లభించింది. దీనిపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేస్తే.. భారత్‌పై నూరుశాతం సుంకాలు పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈ ఆంక్షల బిల్లును ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని వెల్లడించింది. "గతంలో చెప్పినట్టుగానే భారత్ తన 140 కోట్లమంది ప్రజలకు ఇంధన భద్రతను కల్పించడానికి కట్టుబడి ఉంది. మారుతున్న మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా వేర్వేరు వనరుల నుంచి ఇంధన దిగుమతులను కొనసాగిస్తాం. రష్యాతో చమురు వాణిజ్యం అంశంపై అమెరికా ప్రతినిధులతో ఇప్పటికే మిగతా .. 2లో..

## ముత్యపుపందిరి వాహనంపై

# కనువిందు చేసిన మలయప్పస్వామి



**తిరుమల, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజైన గురువారం రాత్రి శ్రీ మలయప్పస్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా ముత్యపుపందిరి వాహనంపై బాలకృష్ణుడి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నిచ్చెన ఎక్కి వెన్న దొంగిలించే బాలకృష్ణుడి లీలను తలపించే ఈ అలంకారం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మాడ వీధుల్లో వైభవంగా సాగిన వాహనసేవలో వివిధ రాష్ట్రాలకు చెందిన మిగతా .. 2లో..

# మెల్‌బోర్న్‌లో రోడ్డు ప్రమాదం.. ఇద్దరు విశాఖ వాసులు మృతి



**విశాఖపట్నం, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విశాఖవాసులు మృతి చెందారు. విశాఖకు చెందిన జీటీ ప్రసాద్ తన భార్యతో కలిసి శుభకార్యంలో పాల్గొనేందుకు ఆస్ట్రేలియా వెళ్లారు. మెల్‌బోర్న్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రసాద్ భార్య, కోడలు మృతి చెందగా.. కారు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తన కళ్లెదుటే కారు ప్రమాదంలో భార్య, కోడలు నేహా మృతి చెందటంతో ఆయన తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. జీటీ ప్రసాద్ గతంలో వీడీసీఏలో జాయింట్ సెక్రటరీగా పనిచేశారు. దాదాపు పది రోజుల తర్వాత మృతదేహాలు విశాఖకు చేరుకునే అవకాశముందని సమాచారం.



# ఏపీ మద్యం రవాణా కుంభకోణంలో మాజీ మంత్రి కారుమూరి రిమాండ్ పొడిగింపు

**విజయవాడ, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** మద్యం రవాణా స్కామ్ కేసులో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు నిందితుడిగా ఉన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయనను... ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు పీటీ వారెంట్‌పై విజయవాడ ప్రత్యేక కోర్టుకు తీసుకువచ్చారు. విచారణ అనంతరం ఆయన రిమాండ్‌ను న్యాయస్థానం మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# మోదీకి అండగా నిలవాలి

భారత్‌ను అభివృద్ధి చెందిన దేశాల సరసన చేరుస్తున్నారు. ఎఖూ అనేది అభివృద్ధి మంత్రం... ఈ మంత్రంతో దేశం అభివృద్ధి చెందుతోంది. వి అంటే వాద్నగర్, కె అంటే కాశీ, ఎస్ అంటే సెప్టెంబర్. ప్రజలకు సేవ చేస్తే.. దేశానికి సేవ చేయడమేనని ప్రధాని నరేంద్ర మోదీ నమ్ముతారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. 80 కోట్ల మంది ప్రజలకు ఉచితంగా ఆహార ధాన్యాలు అందుతున్నాయి. జేజేఎం, అమృత్ వంటి పథకాల ద్వారా 4 కోట్ల ఇళ్లకు తాగునీటి సౌకర్యం కల్పించారు. తాగునీటి కోసం ఎవ్వరూ ఇబ్బంది పడకూడదనేది ప్రధాని కల. ఇవి కేవలం అంకెలు మాత్రమే కాదు... ఈ అంకెలు వెనుక పేద, మధ్య తరగతి కుటుంబాల అభివృద్ధి-సంక్షేమం ఉంది. పీఎం కిసాన్ కింద 11 కోట్ల మంది రైతులు లబ్ధి పొందుతున్నారు... ఇందులో ఎలాంటి మధ్యవర్తులు లేరు. నేరుగా రైతుల ఖాతాలకే నగుదును జమ చేస్తున్నారు."అని ముఖ్యమంత్రి అన్నారు.

**కోవిడ్ వ్యాక్సిన్‌తో 140 కోట్ల ప్రజలను కాపాడారు**

"ప్రపంచంలోని వివిధ దేశాలు సంక్షోభంలో కూరుకుపోతున్న సందర్భంలో నరేంద్ర మోదీ దేశానికి మంచి నాయకత్వం అందించారు. 140 కోట్ల మంది భారతీయులను కాపాడారు... వారికి ఇబ్బందులు కలగకుండా చేశారు. 200 కోట్ల కోవిడ్ వ్యాక్సిన్ డోసులను ఉత్పత్తి చేసేలా ప్రోత్సహించిన ప్రధాని నరేంద్ర మోదీ కరోనా బారి నుంచి ప్రజలను కాపాడారు. 101 దేశాలకు కోవిడ్ వ్యాక్సిన్లను ఉచితంగా సరఫరా చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. విశ్వ మానవాళి సంక్షేమం కోసం డబ్బులు గురించి ఎలాంటి ఆలోచన చేయకుండా కోవిడ్ వ్యాక్సిన్లను నరేంద్ర మోదీ ఉచితంగా వివిధ దేశాలకు అందించారు. ఆత్మనిర్భర్ భారత్, వోకల్ ఫర్ గ్లోబల్ ఇలాంటి విధానాలతో మేకిన్ ఇండియా కాన్సెప్ట్ బలోపేతం అయ్యేలా చేశారు. గతంలో డిఫెన్స్ పరికరాలను దిగుమతి చేసుకునేవాళ్లం.. కానీ ఇప్పుడు ఎగుమతి చేసే స్థాయికి చేరాం. టెక్నాలజీని పూర్తి స్థాయిలో అర్థం చేసుకున్న ఏకైక ప్రధాని నరేంద్ర మోదీ మాత్రమే. స్పేస్, డ్రోన్, క్వాంటం, సెమీ కండెక్టర్ టెక్నాలజీస్ వంటి వాటితో పాటు... రోబోటిక్స్ వంటి వాటిని ప్రధాని మోదీ అర్థం చేసుకోగలరు.. వాటి వల్ల యువతకు లబ్ది చేకూర్చగలరు. గతంలో యువత ఉద్యోగాల మీద ఆధారపడేవాళ్లు. కానీ ప్రధాని దూరదృష్టితో 2.20 లక్షల స్టార్టప్‌ల ద్వారా యువతే ఉద్యోగాలు కల్పించే స్థాయికి చేరుకున్నారు. ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి యువత చేరారంటే దానికి ప్రధాని నరేంద్ర మోదీనే కారణం. అద్భుతమైన స్టార్టప్ ఎకో సిస్టం కలిగిన దేశాల్లో భారత్ మూడో స్థానంలో ఉంది. మహిళా సంక్షేమం, సాధికారత కోసం ప్రధాని చేస్తున్న కృషి అపూర్వం.. భేటీ బచావో-భేటీ పడావో, లక్పతీ దీదీ వంటి పథకాలే దీనికి నిదర్శనం. ఉజ్వల పథకం క్లీన్ ఫ్యూయల్ అందిస్తుంది.. ముద్ర పథకం పెట్టుబడి సమకూరుస్తుంది.. స్వయం సహయక సంఘాలు నమ్మకాన్ని పెంచుతున్నాయి. నారీ శక్తి అధినియం ద్వారా చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్లు ఇవ్వబోతున్నారు.. ఇది గేమ్ ఛేంజర్ కాబోతోంది."అని సీఎం చంద్రబాబు చెప్పారు.

**తిరుగులేని శక్తిగా భారత్**

"ప్రపంచం ముందు భారత్‌ను తిరుగులేని శక్తిగా నిలబెడడానికి కారణం ప్రధాని మోదీ. ఇటీవలే బ్రిక్స్ సదస్సును కూడా సమర్థవంతంగా నిర్వహించారు. వివిధ దేశాల అధినేతలు మన ప్రధాని నాయకత్వంపై నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఎవరైనా దేశంపై దాడి చేయాలంటే భయపడేలా చేశారు... ఆపరేషన్ సింధూర్ ద్వారా ధీటైన జవాబుతో భారత్ శక్తిని ప్రపంచానికి చాటి చెప్పారు. ఆపరేషన్ సింధూర్ ను నిర్వహించిన రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌ను అభినందిస్తున్నాను. నేను కూడా వామపక్ష తీవ్రవాదాన్ని ఎదుర్కొన్నాను.. నన్ను నక్సలైట్లు టార్గెట్ చేశారు... వారికి నేనూ బాధితుణ్ణే. కానీ ఇప్పుడు దేశంలో వామపక్ష తీవ్రవాదాన్ని రూపుమాపారు... దటీజ్ నరేంద్ర మోదీ. దేశం మొత్తానికి ఒకే పవర్ గ్రిడ్ ఏర్పాటు చేసిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీదే. దేశంలో కనెక్టివిటీ పెంచారు. భిన్న సంస్కృతులు, భిన్న భాషలు దేశంలో ఉన్నాయి.. కానీ దేశాభివృద్ధి, ఆత్మనిర్భరత అనేదే మన లక్ష్యం. సుస్థిరత వల్లే ఇది సాధ్యమవుతుంది. సుస్థిరత వల్ల నమ్మకం పెరుగుతుంది.. నమ్మకం వల్ల పెట్టుబడులు వస్తాయి.. పెట్టుబడులు వల్ల ఉద్యోగాలు సమకూరుతాయి.. అభివృద్ధి జరుగుతుంది. ఉద్యోగాల వల్ల ప్రజలకు మేలు జరుగుతుంది. వందే భారత్ రైళ్లను ప్రారంభించారు.. బుల్లెట్ ట్రైన్లు రాబోతున్నాయి. నదుల అనుసంధానం మాత్రమే ఇంకా పెండింగులో ఉంది... ఈ నదుల అనుసంధానం ప్రధాని నరేంద్ర మోదీ ద్వారానే సాధ్యమవుతుంది. బ్రహ్మపుత్ర, గంగ, మహానది, కావేరి, గోదావరి నదులను అనుసంసంధానం చేస్తే భారత్ అన్ స్టాపబుల్. 25 ఏళ్ల పాటు కంటిన్యూగా పాలనలో ఉండడం మామూలు విషయం కాదు. దేశంలో.. ప్రపంచంలో కూడా ఈ విధంగా రాజ్యాంగ పదవిలో ఉండడం సాధ్యం కాదు. ప్రధాని నరేంద్ర మోదీ సమాజాన్ని చదివారు... చాలా నేర్చుకున్నారు... దానికి అనుగుణంగా పాలన చేపట్టారు. 2003లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉండగా నరేంద్ర మోదీ వైబ్రంట్ గుజరాత్ అనే కార్యక్రమం నిర్వహించారు.. ఇప్పుడది గ్లోబల్ బ్రాండ్ గా మారింది. నరేంద్ర మోదీ సారథ్యంలో అభివృద్ధి పట్టణాలకే కాదు... గ్రామీణ ప్రాంతాలకు చేరింది. సబ్ కా సాత్.. సబ్ కా వికాస్.. సబ్ కా విశ్వాస్.. సబ్ కా ప్రయాస్ ఇదే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యం."అని ముఖ్యమంత్రి అన్నారు.

**త్రేతాయుగం.... కలియుగం...**

"కోట్లాది భక్తులు మహా కుంభమేళాకు వారణాసి వచ్చారు. మహా కుంభమేళాను యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ అద్భుతంగా నిర్వహించారు. సుదీర్ఘ కాలంగా పెండింగులో ఉన్న అయోధ్య రామ మందిరం నిర్మాణాన్ని పూర్తి చేశారు. కలగా ఉండే రామ మందిర నిర్మాణాన్ని నరేంద్ర మోదీ నిజం చేశారు. త్రేతాయుగ దైవమైన శ్రీరాముని జన్మస్థలం అయోధ్యలో కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించాలని భావిస్తున్నాం. వెంకన్న ఆలయ నిర్మాణానికి 10 ఎకరాలు కేటాయించాలి."అని సీఎం చంద్రబాబు యూపీ ముఖ్యమంత్రిని కోరారు.

**సభికులను ఇన్‌వాల్వ్ చేస్తూ సాగిన చంద్రబాబు ప్రసంగం**

సీఎం చంద్రబాబు హిందీలో తన ప్రసంగాన్ని ప్రారంభించడంతో సభికుల్లో ఉత్సాహం నెలకొంది. ప్రసంగం మొత్తం సభికులను ఇన్‌వాల్వ్ చేస్తూ సాగడంతో పలుమార్లు పెద్ద ఎత్తున చప్పట్లు, హర్షధ్వానాలు వినిపించాయి. రామజన్మభూమి నుంచి ఆపరేషన్ సింధూర్ వరకు వివిధ అంశాలను ప్రస్తావిస్తూ, ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం సాధిస్తున్న ప్రగతితో పాటు ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం అందిస్తున్న సహకారాన్ని కూడా ఆయన వివరించారు. ఆజ్ మే కాశీకే పవిత్ర ధర్తీ పర్ ఖడా హూ... యే మేరేలియే గర్వ్ కా క్షణ్ హై అంటూ సీఎం చంద్రబాబు హిందీలో తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఇక ప్రసంగం మధ్య మధ్యన దేశ్ బదల్ రహా హై, దేశ్ ఆగే బఢ్ రహా హై, నయా భారత్ హై.... ఆత్మ నిర్భర్ భారత్ హై అంటూ వ్యాఖ్యానించారు. చివరిలో ఏక్ భారత్, శ్రేష్ట్ భారత్, వికసిత్ భారత్... యహీ హమారా సంకల్ప్ హై అంటూ ముఖ్యమంత్రి తన ప్రసంగాన్ని ముగించారు. ముఖ్యమంత్రి ప్రసంగానికి సభికుల నుంచి అతిథుల నుంచి ప్రశంసలు లభించాయి. తన ప్రసంగం ప్రారంభానికి ముందు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చంద్రబాబును ప్రత్యేకంగా అభినందించారు. చంద్రబాబు చాలా అద్భుతంగా మాట్లాడారు... వెరీ వెల్.. వెరీ వెల్ అంటూ ప్రశంసించారు. చంద్రబాబు ప్రసంగానికి చప్పట్లతో అభినందనలు తెలపాలని సభికులను కోరారు. దీంతో రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్ హర్షధ్వానాలతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో చంద్రబాబు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో తన కుటుంబానికున్న అనుబంధాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. తన తండ్రి, దివంగత రామ్‌విలాస్ పాశ్వాన్‌కు చంద్రబాబు అత్యంత సన్నిహితుడని, తన తండ్రి కష్టసుఖాల్లో ఆయనకు అండగా నిలిచారని గత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

**ప్రత్యేక పూజలు...**

వారణాసి-వాద్నగర్ సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కాశీ విశ్వనాథుడిని కేంద్ర మంత్రులు రాజ్ నాథ్ సింగ్, చిరాగ్ పాశ్వాన్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పవిత్ర జలాలతో కాశీ విశ్వేశ్వరుణ్ణి అభిషేకించారు. కాశీ విశ్వనాథుని ఆలయ అర్చకులు ముఖ్యమంత్రికి తీర్థ ప్రసాదాలు అందించారు. అలాగే వారణాసి-వాద్నగర్ సేవా సంకల్ప్ యాత్ర చేపడుతున్న వారికి కేంద్ర మంత్రులు, యూపీ సీఎంతో కలిసి ప్రసాదాన్ని పంచి పెట్టారు. సభ అనంతరం సేవా సంకల్ప్ యాత్రను జెండా ఊపి ప్రారంభించారు.

# 25 ఏళ్ల నిస్వార్థ సేవ

'వికసిత భారత్' లక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకు సాగాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను" - **కేంద్ర హోంమంత్రి అమిత్ షా**

"దేశ చరిత్రలో అత్యధిక కాలం ప్రధానిగా మీ నాయకత్వం నిజంగా చరిత్రాత్మకం. గుజరాత్ ముఖ్యమంత్రి నుంచి ఒక గొప్పప్రజాదరణ పొందిన ప్రధానిగా దేశాన్ని నడిపించడం వరకు.. 25 ఏళ్ల మీ ప్రజాసేవ భారత్ అభివృద్ధి ప్రయాణానికి నూతన వేగాన్ని ఇచ్చింది. మీ సేవాగుణం, మీ సంకల్పం, మీ సుపరిపాలన, మీ విజన్.. దేశంలోని 140 కోట్ల మంది ప్రజల్లో స్ఫూర్తి నింపుతోంది. భరతమాత సేవలో నిరంతరం శ్రమిస్తున్న మీకు ఆ వేంకటేశ్వర స్వామి ఆయురారోగ్యాలను ప్రసాదించాలని కోరుకుంటున్నా" - **ఏపీ సీఎం చంద్రబాబు**

"దేశానికే అంకితమైన జీవితం మీది. 25 ఏళ్ల సుదీర్ఘ నిస్వార్థ ప్రజాసేవను పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి నా హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు. ఒక చిన్న ఇంటి నుంచి దేశ అత్యున్నత పదవి వరకు సాగిన మీ ప్రయాణం అభినందనీయం. మీ నాయకత్వంలో మౌలిక సదుపాయాలు, రైల్వేలు, డిజిటల్ ఇండియా, రక్షణ రంగాల్లో దేశం అపూర్వమైన పురోగతి సాధించింది. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి.. ముఖ్యంగా అమరావతి, పోలవరం, విశాఖపట్నం ఇండస్ట్రియల్ కారిడార్, భోగాపురం విమానాశ్రయం వంటి ప్రాజెక్టులకు మీరు అందిస్తోన్న మద్దతు వెలకట్టలేనిది. 'వికసిత భారత్ 2047' సాధనలో కేంద్రం, ఏపీ కలిసి ముందుకు సాగుతాయి" - **ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**

"ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు. భగవంతుడు మీకు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించి, నిరంతరం దేశ సేవ చేసే శక్తిని అందించాలని ప్రార్థిస్తున్నాను. మీ నాయకత్వంలో అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించాలనే సంకల్పం మరింత శక్తిమంతంగా మారాలి" - **ఎంపీ కంగనా రనౌత్**

"ప్రధాని నరేంద్రమోదీకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. మీ రాజకీయ ప్రస్థానం, మీ సంకల్పం, క్రమశిక్షణ.. అన్ని మీకు దేశంపై ఉన్న ప్రేమను ప్రతిబింబిస్తాయి. మీరు ఎప్పుడూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నా. మరెన్నో ఏళ్ల పాటు మీరు మన దేశానికి సేవ చేయాలని ఆకాంక్షిస్తున్నా" - **చిరంజీవి.**

# రాజకీయాల్లో హుందాతనానికి ప్రతీక నాని

తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల్లో హుందాతనానికి, రాజనీతికి ఆళ్ల నాని ప్రతీకగా నిలిచారని, ఆయన మరణంతో ఆంధ్రప్రదేశ్ ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయిందని అన్నారు. ఏలూరులోని ఆళ్ల నాని నివాసానికి చేరుకున్న లోకేశ్, ఆయన పార్థివదేహంపై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాని కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మీడియాతో మాట్లాడుతూ "ఆళ్ల నాని అన్న మరణవార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన మంత్రిగా ఉన్న సమయంలో నేను ఎమ్మెల్సీగా శాసనమండలిలో ఉన్నాను. సభలో ఎన్నో అంశాలపై వాడివేడిగా చర్చించేవాళ్ళం. కానీ, ఆయన ఏనాడూ వ్యక్తిగత దూషణలకు దిగలేదు. ప్రజా సమస్యలపై మాట్లాడటానికే సభ సమయాన్ని ఉపయోగించాలని బలంగా నమ్మిన వ్యక్తి ఆయన. రాజకీయాల్లో హుందాతనం ఎలా ఉండాలో ఆచరణలో చూపించారు" అని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా వివిధ హోదాల్లో ఆళ్ల నాని రాష్ట్రానికి చేసిన సేవలు చిరస్మరణీయమని లోకేశ్ కొనియాడారు. "ముఖ్యంగా, ప్రపంచం గజగజలాడిన కోవిడ్ మహమ్మారి సమయంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రిగా నాని అందించిన సేవలు మరువలేనివి. ఎన్నో సవాళ్లు, ఒత్తిళ్లు ఎదురైనా వాటిని అధిగమించి, ప్రజల ప్రాణాలను కాపాడటానికి, నమ్ముకున్న నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి ఆయన అహర్నిశలు శ్రమించారు" అని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీలో ఆళ్ల నాని చేరిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ.. "మీరు క్రమశిక్షణ అనే పాఠశాలకు చెందినవారు. ఎప్పుడూ లక్ష్మణ రేఖ దాటని మీలాంటి వారిని చూసే మాలాంటి యువత రాజకీయాల్లోకి రావాలనుకుంటుంది అని నేను నాని అన్నతో చెప్పాను. అలాంటి గొప్ప వ్యక్తి ఈరోజు మన మధ్య లేకపోవడం అత్యంత బాధాకరం" అని లోకేశ్ అన్నారు. ఆళ్ల నాని కుటుంబానికి తెలుగుదేశం పార్టీ తరఫున, వ్యక్తిగతంగానూ ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆళ్ల నాని అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహిస్తున్నట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. మంత్రి కొలుసు పార్థసారథి ఏలూరులోనే ఉండి అంత్యక్రియల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం, టీడీపీ తరఫున ఆళ్ల నానికి ఘన నివాళులు అర్పిస్తున్నామని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొలుసు పార్థసారథి, డా. నిమ్మల రామానాయుడు, ఎంపీ పుట్టా మహేష్ కుమార్, పలువురు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, టీడీపీ నాయకులు పాల్గొని ఆళ్ల నానికి నివాళులర్పించారు.

# నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారు

మార్చుకున్నారని, అసలు వాస్తవాలు ఏమిటో ప్రజలకు స్పష్టంగా తెలుసని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే వీరికి తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. మరోవైపు, ఏపీపీఎస్సీ కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే వైసీపీ ఈ రాద్ధాంతం చేస్తోందని అప్పసాని రాజేశ్ ఆరోపించారు. డీఎస్సీ నియామకాలను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు వేసిన 320 కేసులను న్యాయస్థానం కొట్టివేసిందని గుర్తు చేశారు. గత ఐదేళ్ల పాలనలో 'జాబ్‌లెస్ క్యాలెండర్'తో యువతను మోసం చేసిన జగన్, ఇప్పుడు అత్యంత పారదర్శకంగా జరిగిన డీఎస్సీపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

# నా మనసు చలించింది

కోసమే పరితపించిన మల్సూర్ కుటుంబం నేడు నిలువనీడ కోసం ఎదురుచూస్తున్న విషయం తెలుసుకొని నా మనసు చలించిపోయింది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కల్వకుంట్ల కుటుంబం ప్రజల సొమ్మును దోచుకుని ఫామ్‌హౌస్‌లు నిర్మించుకుంది తప్ప.. పేదలకు ఇళ్లు నిర్మించలేదని చెప్పడానికి ఉప్పల మల్సూర్ కుటుంబం దీనగాథే నిదర్శనం. ఈ రోజు పత్రికల్లో వచ్చిన కథనాన్ని చూసిన వెంటనే అధికారులను ఆదేశించి, ఉప్పల మల్సూర్ కోడళ్లు ఉప్పల పుష్పలత, యశోద పేర్లపై రెండు ఇందిరమ్మ ఇళ్లను తక్షణమే మంజూరు చేశాం. వాటి మంజూరుకు సంబంధించిన ప్రొసీడింగ్స్ ప్రతులను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ స్వయంగా కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రతి పేదవాడి సొంతింటి కలను నెరవేర్చడమే ఇందిరమ్మ ప్రభుత్వం లక్ష్యం" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

# సొంత పార్టీలోనే బిగ్ షాక్

స్థానిక బీఆర్ఎస్ పార్టీలో తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తూ కేసీఆర్, కేటీఆర్ ఫొటోలు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన గులాబీ శ్రేణులు, పలు ప్రాంతాల్లో వాటిని చించివేసి నిరసన తెలిపారు. ఐడీపీఎల్, సుచిత్ర ప్రధాన రహదారుల వెంట ప్రీతిరెడ్డి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లతో పాటు స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు చిత్రాలను విస్మరించడం వివాదానికి కేంద్రబిందువైంది. పార్టీ అగ్రనాయకులను పక్కనబెట్టి కేవలం మల్లారెడ్డి, ఆయన అల్లుడు మర్రి రాజశేఖర్ రెడ్డి చిత్రాలను మాత్రమే ఫ్లెక్సీలలో ముద్రించడాన్ని స్థానిక బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా తప్పుబట్టాయి. మల్లారెడ్డి కేవలం స్వప్రయోజనాల కోసమే రాజకీయాలు చేస్తున్నారని, అధిష్ఠానాన్ని బేఖాతరు చేస్తున్నారని ఆరోపిస్తూ కార్యకర్తలు ఫ్లెక్సీలను చించివేశారు. భవిష్యత్తులోనూ ఇలాగే ప్రవర్తిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని మల్లారెడ్డి కుటుంబాన్ని హెచ్చరించారు. ఈ పరిణామంపై ప్రీతిరెడ్డి అభిమానులు, మద్దతుదారులు మండిపడ్డారు. పుట్టినరోజు సందర్భంగా అభిమానులు వ్యక్తిగతంగా ఏర్పాటు చేసిన శుభాకాంక్షల ఫ్లెక్సీలకు, పార్టీ రాజకీయాలకు ముడిపెట్టి గొడవ చేయడం సరైంది కాదని వారు ప్రశ్నిస్తున్నారు. గత కొంతకాలంగా మేడ్చల్, మల్కాజిగిరి పరిధిలో మల్లారెడ్డి వర్గానికి, స్థానిక బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు మధ్య నడుస్తున్న అంతర్గత విభేదాలు ఈ ఫ్లెక్సీల గొడవతో మరోసారి బహిర్గతమయ్యాయి.

# భారత్ రియాక్షన్ ఇదే

చర్చించాం. ద్వైపాక్షిక సంబంధాలపై మాత్రమే కాకుండా అంతర్జాతీయ ఇంధన మార్కెట్ల స్థిరత్వంపై కూడా ఈ బిల్లు ప్రభావం చూపించే అవకాశం ఉందని స్పష్టంగా తెలియజేశాం. భారత వాణిజ్య, ఆర్థిక ప్రయోజనాలను పరిరక్షించుకోవడానికి అవసరమైన అన్ని చర్యలను భారత ప్రభుత్వం తీసుకుంటుందని యూఎస్‌కు ఇప్పటికే చెప్పాం. ఈ బిల్లు చట్టరూపం దాల్చితే భారత వాణిజ్యంపై పడే ప్రభావాలను ఎదుర్కొనేందుకు సంబంధిత సంస్థలతో కలిసి పనిచేస్తున్నాం" అని కేంద్ర విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది.

# కనువిందు చేసిన మలయప్పస్వామి

కళాబృందాల ప్రదర్శనలు భక్తులను అలరించాయి. పెద్ద సంఖ్యలో భక్తులు మాడ వీధులకు తరలివచ్చి స్వామివారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకుని భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.

**ముత్యపుపందిరి వాహనం.. సకల సౌభాగ్య సిద్ధికి ప్రతీక**

జ్యోతిషశాస్త్రంలో ముత్యాలు చంద్రునికి ప్రతీకగా పేర్కొన్నారు. శ్రీకృష్ణుడు ముక్కుపై, మెడలో ముత్యాల ఆభరణాలు ధరించినట్లు పురాణాల్లో ప్రస్తావన ఉంది. ఆదిశేషుని పడగలను ముత్యాల పందిరిగా స్వీకరించి శ్రీనివాసుడు భక్తులకు దర్శనమివ్వడం ఈ వాహనసేవ ప్రత్యేకత. చల్లని ముత్యాల పందిరి కింద కొలువైన శ్రీవారిని దర్శించుకోవడం వల్ల తాపత్రయాలు తొలగి, భక్తుల జీవితాల్లో సుఖశాంతులు, సకల శుభాలు చేకూరుతాయని పురాణ ప్రశస్తి. ఈ వాహనసేవలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, తితిదే ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి కారుమూరి రిమాండ్ పొడిగింపు

సెప్టెంబరు 25 వరకు పొడిగించింది. ఈ కేసు విషయానికొస్తే... (ఈడీ నివేదిక ప్రకారం) సాధారణ నిబంధనల మేరకు కిలోమీటర్‌కు రూ. 13 మాత్రమే రవాణా ఛార్జీలుగా చెల్లించాల్సి ఉండగా, టెండర్ల నిబంధనలను అక్రమంగా సవరించి కిలోమీటర్‌కు ఏకంగా రూ. 35 వరకు చెల్లించారు. ఈ అక్రమ మార్పుల కారణంగా ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ. 195.33 కోట్ల మేర భారీ నష్టం వాటిల్లినట్లు దర్యాప్తు సంస్థ ప్రాథమికంగా లెక్కగట్టింది. కారుమూరి నాగేశ్వరరావు పౌరసరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సమయంలో తన అధికారిక హోదాను దుర్వినియోగం చేస్తూ తన కుమారుడు, వ్యాపార భాగస్వాములకు మద్యం రవాణా సబ్‌కాంట్రాక్టులు దక్కేలా చక్రం తిప్పారని దర్యాప్తులో నిర్ధారణ అయింది. ఈ వ్యవహారంలో హవాలా మార్గంలో దాదాపు రూ. 15 కోట్లు కారుమూరికి చేరినట్లు ఆధారాలు సేకరించిన అధికారులు, ఇప్పటివరకు ఆయన కుటుంబానికి చెందిన రూ. 87.7 కోట్ల విలువైన ఆస్తులను తాత్కాలికంగా జప్తు చేశారు. ఈ కేసులో ఇప్పటికే కారుమూరి కుమారుడు సునీల్ కుమార్, ఏపీఎస్‌బీసీఎల్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి, డిజిటల్ నెట్‌వర్క్ అధినేత కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డిలను ఈడీ అరెస్ట్ చేసి విచారిస్తోంది.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



**రాయవరం, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, మంచి మార్గంలో నడవాలని రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు సూచించారు. రాయవరం మండలం, వెంటూరు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పోలీసులు ఈగల్ టీం ఏఎస్సై అప్పారావుతో కలిసి డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సురేష్ బాబు మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం ఆరోగ్యం, కుటుంబం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని, మత్తు పదార్థాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగానికి సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఎస్సై కోరారు.

# గణేష్ నిమజ్జన రేవుల్లో ఏర్పాట్లపై అధికారుల పరిశీలన



**రాయవరం, సెప్టెంబర్ 17, విశ్వంవాయిస్ న్యూస్ :** గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా విగ్రహాల నిమజ్జనాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు రాయవరం మండల పరిధిలోని నిమజ్జన రేవులను అధికారులు గురువారం సంయుక్తంగా పరిశీలించారు. మండపేట రూరల్ సీఐ పి. దొరరాజు, రాయవరం తహసీల్దార్ ఎం.వి. సాయి ప్రసాద్, ఎంపీడీవో కె.వి.ఎస్.ఎస్. సూర్యనారాయణమూర్తి, ఎస్సై డి. సురేష్‌బాబు లు రేవులను పరిశీలించి ఏర్పాట్లపై సమీక్షించారు. నిమజ్జన రేవుల వద్ద తాగునీరు, విద్యుత్, లైటింగ్, బారికేడింగ్, రాకపోకల నియంత్రణ, పారిశుద్ధ్యం, భద్రత వంటి ఏర్పాట్లు పటిష్ఠంగా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్, రెవెన్యూ, పంచాయతీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. స్థానిక పంచాయతీ సెక్రటరీలు, వీఆర్వోలు, మహిళా పోలీసుల సహకారంతో రేవుల వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రజలు గణేష్ నిమజ్జనాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేలా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

# ఎడిటర్ వాయిస్

## అక్కడ వేమిరెడ్డితోనే వైసీపీ ఢీ కొట్టాలి!

వైసీపీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చి రాజ్యసభ సభ్యుడు కూడా అయి వైసీపీకి నెల్లూరు జిల్లాలో ఒక బలమైన నేతగా ఉంటూ వచ్చిన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని 2024 ఎన్నికల ముందు వైసీపీ పోగోట్టుకుంది. ఆయన కోరినట్లుగా ఎంపీ ఎమ్మెల్యే టికెట్లను ఇచ్చేందుకు అధినాయకత్వం తిరస్కరించడంతో గోల్డెన్ చాన్స్ ని టీడీపీ అందుకుంది. కాంగ్రెస్ జమానా నుంచి కూడా నెల్లూరు జిల్లాలో టీడీపీకి రాజకీయ పట్టు తక్కువ. అలాంటిది వైసీపీ గత రెండు ఎన్నికల్లో బ్రహ్మండంగా గెలిచిన జిల్లాను 2024 ఎన్నికల్లో టీడీపీ కూటమికి సంపూర్ణంగా సమర్పించేసుకుంది అంటే దానికి ఆ పార్టీ అధినాయకత్వం తీసుకున్న ఏకపక్ష నిర్ణయాలే కారణం అని అంటున్నారు. వేమిరెడ్డి లాంటి బలమైన నేతలను వదులుకు నెల్లూరు జిల్లాలో వైసీపీ ఎంతగా నష్టపోయింది అన్నది ఫలితాలు రుజువు చేశాయి.

**ఒంటి చేత్తో నడిపిస్తూ :** ఇక టీడీపీలో చేరిన వేమిరెడ్డి నెల్లూరు నుంచి లోక్ సభ సభ్యుడు అయ్యారు. ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతి కోవూరు నుంచి సీనియర్ నేత మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని ఓడించి తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. ఇపుడు నెల్లూరు జిల్లాలో వేమిరెడ్డి హవా నడుస్తోంది. దాంతో నెల్లూరు మునిసిపల్ కార్పోరేషన్ ఎన్నికల్లో కూటమి విజయానికి వేమిరెడ్డి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఆయన చుట్టూనే ఆశావహులు అంతా ప్రదక్షిణం చేస్తున్నారు. కార్పోరేషన్ ఎన్నికలు అంటే భారీ బడ్జెట్ వ్యవహారం అందుకే వేమిరెడ్డి మీదనే మొత్తం బాధ్యతలను కూడా అధినాయకత్వం పెడుతోంది అని అంటున్నారు. దాంతో పాటుగా వేమిరెడ్డి తన అనుచరులను మేయర్ పీఠం మీద కూర్చోబెట్టాలని చూస్తున్నట్లుగా చెబుతున్నారు.

**వైసీపీకి కష్టమే :** వేమిరెడ్డి అంగబలం అర్ధ బలం తట్టుకుని నిలిచి గెలవడం అన్నది వైసీపీకి ఇపుడున్న పరిస్థితుల్లో కష్టమే అని అంటున్నారు. పైగా కూటమికి నెల్లూరు జిల్లాలో ఏకంగా మునిసిపల్ మంత్రి నారాయణ ఉన్నారు. అలాగే నెల్లూరు రూరల్ జిల్లా ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి వంటి మాస్ లీడర్ ఉన్నారు. ఇలా నెల్లూరు జిల్లాలో ఇపుడు కూటమి అత్యంత పటిష్టంగా ఉంది. అంతా కలసి కూర్చుంటే నూటికి నూరు శాతం స్ట్రైక్ రేటు కూటమికే దక్కుతుందని అంటున్నారు. మరి ఇంతలా పకడ్బందీగా రాజకీయం చేస్తున్న కూటమి నుంచి ప్రత్యేకించి వేమిరెడ్డిని ధీటుగా ఎదుర్కోవడం వైసీపీకి అయ్యే పనేనా అని అంతా చర్చిస్తున్నారు.

**నల్లేరు మీద నడక మాదిరి :** వైసీపీలో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ యాక్టివ్ అయ్యారు కానీ ఆయన మొత్తం కార్పోరేషన్ ఎన్నికలను ఒంటి చేత్తో నడిపించగలరా అని ఆలోచిస్తున్నారు. ఇక అనిల్ కుమార్ యాదవ్ నల్లపురెడ్డి ఇద్దరూ కూడా వేమిరెడ్డి మీద విమర్శలు చేస్తూ మరింతగా ఆయన్ని రెచ్చగొడుతున్నారని అంటున్నారు. దీంతో వేమిరెడ్డి కార్పోరేషన్ ఎన్నికలను ప్రతిష్టగా తీసుకోవాలని నిర్ణయించారని అంటున్నారు. ఒక విధంగా చూస్తే కూటమికి ఈ ఎన్నికలు నల్లేరు మీద నడక మాదిరిగా ఉంటాయని అంటున్నారు. అదే సమయంలో మాటలకే తప్ప చేతల దాకా కధను వైసీపీ నేతలు ఎంత మేరకు నడుపుతారు అన్నది కూడా చర్చగా ఉంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

## యూట్యూబర్ వైష్ణవి భర్త దారుణహత్య



**నిజామాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** యూట్యూబర్ వైష్ణవి హత్యకేసులో నిందితుడు, ఆమె భర్త చిత్తరి హరిబాబు(26) నిజామాబాద్ నగరంలో దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత కొన్ని రోజులుగా హరిబాబు తన తల్లితో కలిసి నిజామాబాద్ ఐదో ఠాణా పరిధిలోని ఇంద్రాపూర్లో నివాసం ఉంటున్నాడు. రాజరాజేంద్ర చౌరస్తాలో మక్కబుట్టలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజులాగే గురువారం మక్కబుట్టలు అమ్ముకుంటున్న క్రమంలో.. దాహం వేసి నీళ్ల కోసం పక్కనే ఉన్న చాట్‌బండి వద్దకు వెళ్లాడు. అదే సమయంలో ఓ కారులో గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి ఆయన తలపై పదునైన ఆయుధంతో విచక్షణారహితంగా దాడి చేశారు. తీవ్రగాయాలపాలైన హరిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కారులో ముగ్గురు వ్యక్తులు ఉండగా... ఓ వ్యక్తి వచ్చి పదునైన ఆయుధంతో తలపై నరికిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. నిందితుడు 10 సెకన్లలో 9 సార్లు కత్తితో నరికిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

**వైష్ణవి హత్య కేసులో హరిబాబు నిందితుడు..**

జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన వైష్ణవి (19), కోరుట్ల పట్టణం ఏసుకోనిగుట్టకు చెందిన చిత్తరి హరిబాబు(26)కి వివాహం జరిగింది. నాలుగు నెలల గర్భిణిగా ఉన్న వైష్ణవి గొంతు నులిమి, చేతులు, నుదిటిపై కత్తితో పొడిచి హత్య చేసినట్లు హరిబాబుపై ఆరోపణలున్నాయి. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు హరిబాబును అరెస్టు చేశారు. ప్రస్తుతం బెయిల్‌పై జైలు నుంచి బయటికొచ్చిన నిందితుడు ఇవాళ దారుణహత్యకు గురయ్యాడు.

## ఇనుపరాడ్డుతో కొట్టి.. యాసిడ్ పోసి.. ప్రియుడిని చంపిన ప్రియురాలు

**గరివిడి, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయనగరం జిల్లాలో దారుణ హత్య జరిగింది. ప్రియుడిని ప్రియురాలు హతమార్చింది. సహజీవనం చేస్తున్న జంట మధ్య ఘర్షణ జరిగి ఈ ఘటనకు దారితీసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గరివిడి మండలం కందిపేటకు చెందిన దనాల రాములమ్మ భర్తకు దూరంగా ఉంటోంది. ఈ క్రమంలో తన బావ కుమారుడైన శ్రీనుతో సన్నిహితంగా మెలిగింది. అతడు కూడా భార్యకు దూరంగా ఉంటున్నాడు. కొంతకాలంగా రాములమ్మ, శ్రీను సహజీవనం చేస్తున్నారు. గురువారం తెల్లవారుజామున వీరిద్దరి మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో రాములమ్మ ఇనుపరాడ్డుతో శ్రీను తలపై బలంగా కొట్టింది. అనంతరం యాసిడ్ పోయడంతో తీవ్రగాయాలతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం రాములమ్మ పురుగుల మందు తాగడంతో ఆమెను ఆస్పత్రికి తరలించారు. ఈ సమాచారం అందుకున్న చీపురుపల్లి సీఐ శంకరరావు, ఎస్సై లోకేశ్వరరావు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేశారు.

### పెద్దలు అంగీకరించలేదని..

## బావిలో దూకి ప్రేమ జంట ఆత్మహత్య



**దేవరాపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** పెళ్లికి పెద్దలు అంగీకరించకపోవడంతో మనస్తాపానికి గురైన ప్రేమజంట ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అనకాపల్లి జిల్లాలో గురువారం చోటుచేసుకుంది. పెందుర్తికి చెందిన ఇద్దరు మైనర్లు (17) ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నారు. ఈ క్రమంలో కొంతకాలంగా ఇద్దరి మధ్య ప్రేమ చిగురించింది. ఇద్దరూ మైనర్లు కావడంతో వివాహానికి పెద్దలు నిరాకరించినట్లు తెలిసింది. దీంతో మనస్తాపానికి గురై బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్టు సమాచారం. స్థానిక సీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించారు. ఘటనపై ఎస్ఐ ఆర్.ధనుంజయ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వేధింపులు తాళలేక కుమారుడిని హత్య చేసిన తల్లి



**కరీంనగర్ జిల్లా తనుగులలో ఘటన**

**జమ్మికుంట, విశ్వం వాయిస్ న్యూస్ :** కుమారుడు నిత్యం మద్యం తాగి గొడవపడటం, డబ్బులు అడగడం, చేసిన అప్పులు తీర్చేందుకు పొలం విక్రయించాలని ఒత్తిడి చేయడంతో విసిగిపోయిన ఓ తల్లి... కుమార్తె, అల్లుడి సాయంతో కుమారుడిని హత్యచేసి ఓ పొలంలో ఖననం చేసిన ఘటన కరీంనగర్‌లో చోటుచేసుకుంది. హత్యకు సంబంధించిన వివరాలను హుజూరాబాద్ ఏసీపీ మాధవి బుధవారం వెల్లడించారు. ఇల్లందకుంట మండలం రాచపల్లికి చెందిన ఒజ్జపల్లి రాజబాబు(35) జమ్మికుంటలో తల్లి లచ్చమ్మతో కలిసి ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. తాను చేసిన అప్పులు తీర్చేందుకు భూమిని విక్రయించాలని ఒత్తిడి చేయగా తల్లి లచ్చమ్మ, అక్క కవిత, బావ జూపాక శంకర్ నిరాకరించారు. దీంతో ఈ నెల 7న రాజబాబు జమ్మికుంట మండలం తనుగులలోని తన సోదరి ఇంటికెళ్లి గొడవ పడి..ఇంట్లోని సామగ్రి ధ్వంసం చేశాడు. దీనిపై వారు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ ఇచ్చారు. రాజబాబు తప్పును అంగీకరించాడు. మళ్లీ ఈ నెల 10న రాజబాబు మద్యం తాగొచ్చి సోదరి ఇంటి కెళ్లి గొడవ చేశాడు. దీంతో విసిగిపోయిన తల్లి... కుమార్తె, అల్లుడితో కలిసి మరికొందరు శంకర్ మిత్రులు మారపల్లి రాజయ్య, చేతి వెంకటేశ్, జూపాక సతీశ్, కుంటి శంకర్‌లు రాజబాబును మంచానికి కట్టేసి చున్నీతో ఉరేసి హత్య చేశారు. అదేరోజు రాత్రి మృతదేహాన్ని శంకర్ తన పొలంలో ఖననం చేశారు. రాజబాబు అదృశ్యంపై మంగళవారం జమ్మికుంటలోని ఇంటి యజమాని సత్యనారాయణ ఫిర్యాదు చేయగా... దర్యాప్తులో భాగంగా హత్యోదంతం వెలుగులోకి వచ్చింది. నేరాన్ని అంగీకరించిన ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నామని ఏసీపీ తెలిపారు.

# చాతుర్మాసం తర్వాత పెళ్లి ముహూర్తాలు ఇవే..

## నవంబర్, డిసెంబర్‌లో ఎన్ని రోజాలో తెలుసా?



**2026లో చాతుర్మాసం నవంబర్‌లో ముగియనుంది.** ఆ తర్వాత వివాహధి శుభకార్యాలకు ముహూర్తాలు ప్రారంభమమతాయి. నవంబర్, డిసెంబర్ నెలల్లో పెళ్లికి అనుకూలమైన తేదీలు ఏవి? చాతుర్మాసంలో వివాహలు ఎందుకు చేయరు? ఈ కాలానికి ఉన్న ధార్మిక ప్రాధాన్యత ఏమిటో తెలుసుకోండి.

హిందూ ధర్మంలో చాతుర్మాసం, మాసం, భార్మాసం వంటి కాలాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ముఖ్యంగా చాతుర్మాస కాలంలో వివాహలు, గృహప్రవేశాలు వంటి శుభకార్యాలను నిర్వహించకూడదనే ఆచారం చాలాకాలంగా కొనసాగుతోంది. ఈ సమయంలో భక్తులు జపం, తపస్సు, ధ్యానం, ఉపవాసం, పూజ వంటి ఆధ్యాత్మిక కార్యకమాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. సాధారణంగా చాతుర్మాసం ప్రారంభమైన తర్వాత వివాహది శుభకార్యాలకు విరామం ఉంటుంది. దీంతో ఏడాది పొడవునా వివాహం చేసుకోవాలని ఎదురుచూసే కుటుంబాలు. చాతుర్మాసం ముగిసిన తర్వాత వచ్చే శుభ ముహూర్తాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుంటాయి. ముఖ్యంగా నవంబర్, డిసెంబర్ నెలల్లో వివాహలు ఎక్కువగా జరుగుతుంటాయి. 2026లో చాతుర్మాసం ఎప్పుడు ముగుస్తుంది? నవంబర్, డిసెంబర్ నెలల్లో వివాహలకు ఎన్ని శుభ తేదీలు ఉన్నాయి? తెలుసుకుందాం.

### చాతుర్మాసం 2026 ఎప్పుడు ముగుస్తుంది?

2026లో చాతుర్మాసం జూలై 25 నుంచి నవంబర్ 21 వరకు కొనసాగుతుంది. ఈ కాలంలో శ్రీమహావిష్ణువు యోగనిద్రలో ఉంటారని హిందూ ధర్మ విశ్వాసం. అందువల్ల వివాహలు, గృహప్రవేశాలు వంటి ముఖ్యమైన శుభకార్యాలను సాధారణంగా నిర్వహించరు. చాతుర్మాస కాలం సుమారు నాలుగు నెలల పాటు కొనసాగుతుంది. ఇందిలో శ్రావణం, భాద్రపదం, అశ్వయుజం, కార్తీకం మాసాలు వస్తాయి. ఈ కాలాన్ని భక్తి, నియమాలు, ఉపవాసాలు, పూజలు, ధ్యాసం వంటి ఆధ్యాత్మిక సాధనలకు అనుకూలమైనదిగా భావిస్తారు.



కార్తీక మాసంలో వచ్చే దేవత్తాన ఏకాదశితో చాతుర్మాసం ముగుస్తుందని ధార్మిక సంప్రదాయాలు చెబుతున్నాయి. ఈ రోజున శ్రీమహావిష్ణువు యోగనిద్ర నుంచి మేల్కొంటారని విశ్వసిస్తారు. అనంతరం వివాహలు, ఇతర శుభకార్యాలకు మళ్లీ శ్రీకారం చుడతారు. ఇదే సమయంలో తులసి వివాహం నిర్వహించే సంప్రదాయం కూడా ఉంది.



### చాతుర్మాసంలో వివాహలు ఎందుకు నిర్వహించరు?

శ్రీమహావిష్ణువు క్షీరసాగరంలో యోగనిద్రలోకి వెళతారు. ఆయన యోగనిద్రలో ఉండే నాలుగు నెలల కాలాన్నే చాతుర్మాసంగా భావిస్తారు. ఈ సమయంలో వివాహలు, గృహప్రవేశాలు వంటి శుభకార్యాలను నిర్వహించదం సంప్రదాయబద్ధంగా నివారిస్తారు. ఈ కాలాన్ని సంయమనం, ఉపవాసం, పూజ, జపం, ధ్యానం, ఆధ్యాత్మిక చింతనకు కేటాయించాలనే భావన ఉంది.

### నవంబర్ 2026లో వివాహ ముహూర్తాలు

చాతుర్మాసం ముగిసిన తర్వాత నవంబర్‌లో వివాహలకు నాలుగు శుభ తేదీలు ఉన్నట్లు వెర్కొనబడింది.

| తేది | వారం | ముహూర్తం / నక్షత్రం |
|---|---|---|
| నవంబర్ 21, 2026 | శనివారం | ఉదయం 06:44 – మధ్యాహ్నం 12:08 (రేవతి నక్షత్రం) |
| నవంబర్ 24, 2026 | మంగళవారం | రాత్రి 11:25 – నవంబర్ 25 ఉదయం 06:47 (రోహిణి నక్షత్రం) |
| నవంబర్ 25, 2026 | బుధవారం | నవంబర్ 26 ఉదయం 06:47 – 06:48 |
| నవంబర్ 26, 2026 | గురువారం | ఉదయం 06:48 – సాయంత్రం 05:47 |

శుభ ముహూర్తాల్లో శుభకార్యాలు సాఫల్యం కలుగాలి...!

### డిసెంబర్ 2026లో వివాహ ముహూర్తాలు

డిసెంబర్‌లో వివాహలకు ఏడు శుభ తేదీలు ఉన్నట్లు పేర్కొనబడింది.

| తేది | వారం | తిథి/ నక్షత్రం |
|---|---|---|
| డిసెంబర్ 2, 2026 | బుధవారం | నవమి, దశమి తిథులు |
| డిసెంబర్ 3, 2026 | గురువారం | ఉత్తర పాల్గుణి / హస్త నక్షత్రం |
| డిసెంబర్ 4, 2026 | శుక్రవారం | ఏకాదశి తిథి |
| డిసెంబర్ 5, 2026 | శనివారం | ద్వాదశి, త్రయోదశి తిథులు |
| డిసెంబర్ 6, 2026 | ఆదివారం | త్రయోదశి తిథి |
| డిసెంబర్ 11, 2026 | శుక్రవారం | తృతీయ తిథి |
| డిసెంబర్ 12, 2026 | శనివారం | తృతీయ, చతుర్థ తిథులు |

సాంప్రదాయాన్ని పాటిద్దాం... శుభకార్యాలను సంతోషంగా జరుపుకుందాం...






# మానవత్వానికి చిరునామా మంత్రి వాసంశెట్టి సుభాష్

**ఐదుగురికి రూ.1.10 లక్షల ఆర్థిక సాయం**

**సేవా మార్గంలో తండ్రి - కొడుకులు.. వాసంశెట్టి సత్యం, మంత్రి సుభాష్‌ల సామాజిక సేవలకు ప్రజల ప్రశంసలు**

**కష్టాల్లో ఉన్న కుటుంబాలకు అండగా.. పేదల కన్నీరు తుడవడమే లక్ష్యంగా..**

**రామచంద్రపురం, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** మానవత్వం, సేవాభావం, దాతృత్వానికి ప్రతిరూపంగా నిలుస్తున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మరోసారి తన పెద్ద మనసును చాటుకున్నారు. కష్టం అని తన వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరినీ ఆదుకోవాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్న మంత్రి సుభాష్, ఐదుగురు బాధితులకు మొత్తం రూ.1,10,000 ఆర్థిక సహాయం అందించి వారి కుటుంబాలకు అండగా నిలిచారు. ప్రజాసేవను రాజకీయాలకు అతీతంగా భావిస్తున్న మంత్రి సుభాష్, ప్రభుత్వం తనకు అందించే మొత్తం జీతంతో పాటు స్వంత నిధులను వెచ్చిస్తూ నిరుపేదల కష్టసుఖాల్లో భాగస్వామి అవుతున్నారు. ఏ కుటుంబంలో కష్టం వచ్చినా కన్న కొడుకులా స్పందిస్తూ, మానవత్వమే తన రాజకీయాల మూలమంత్రంగా ముందుకు సాగుతున్నారు. కులం, మతం, పార్టీ అనే భేదాలు లేకుండా కష్టం, అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికి సహాయం చేస్తూ ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. స్థానిక వైఎస్ఆర్ నగర్‌కు చెందిన గంధం అబ్బులు ఇన్ఫెక్షన్ కారణంగా కాలు తొలగించాల్సి రావడంతో చక్రాల కుర్చీకే పరిమితమయ్యారు. ఆయన పరిస్థితిని తెలుసుకున్న మంత్రి సుభాష్ వెంటనే స్పందించి రూ.30,000 ఆర్థిక సహాయం అందించారు. అలాగే



పట్టణంలోని మూడో వార్డుకు చెందిన దుర్గాప్రసాద్ అనే ప్రమాద బాధితుడికి రూ.15,000 ఆర్థిక సాయం అందించి ధైర్యం చెప్పారు. ఇక తన పర్యటనలో భాగంగా రామచంద్రపురం రూరల్ మండలం ఉట్రుమిల్లి గ్రామంలో కుమారుడిని కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న వేమగిరి జ్యోతి కుటుంబానికి రూ.25,000 అందించి మానవతా భరోసా కల్పించారు. అదే గ్రామానికి చెందిన ఉండ్రాచలపు రమేష్ ఇంటి నిర్మాణం మధ్యలోనే నిలిచిపోవడంతో ఆయనకు రూ.30,000 సహాయం చేశారు. అలాగే ప్రమాదవశాత్తు కాలు విరిగి అనారోగ్యంతో బాధపడుతున్న ఉండ్రాచలపు వీరేష్ కు రూ.10,000 ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. ఈ విధంగా మొత్తం రూ.1.10 లక్షలు ఆర్థిక సహాయం అందించిన మంత్రి సుభాష్, కష్టాల్లో మీకు నేనున్నాను అనే సందేశాన్ని మరోసారి ప్రజలకు చాటిచెప్పారు. మంత్రి సుభాష్ సేవా ప్రస్థానం రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ప్రారంభమైనది కాదు. ప్రజా ప్రతినిధిగా మారకముందే గత పదిహేనేళ్లుగా నిరంతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. ఈ సేవా స్ఫూర్తికి మూలం ఆయన తండ్రి, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం. సమాజం పట్ల ఉన్న బాధ్యతతో ఆయన ఆధ్వర్యంలో స్థాపించబడిన సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా వందలాది మంది నిరుపేద విద్యార్థులకు విద్యా సహాయం అందుతోంది. అనేక మంది విద్యార్థులను దత్తత తీసుకుని కేజీ నుంచి పీజీ వరకు చదివించడం, మహిళలకు వృత్తి నైపుణ్య శిక్షణలు అందించి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం, నిరుద్యోగ యువతకు జాబ్ మేళాల ద్వారా ఉపాధి కల్పించడం, ప్రజారోగ్య పరిరక్షణ కోసం కంటైనర్ క్లినిక్‌లు, సంచార వైద్యశాలలు నిర్వహించడం, డయాలసిస్ యూనిట్ ఏర్పాటుకు నిధులు సమకూర్చడం వంటి అనేక సేవా కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయి. తండ్రి వాసంశెట్టి సత్యం చూపిన సేవా మార్గంలోనే మంత్రి సుభాష్ ముందుకు సాగుతూ, ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి సహాయం అందించడం రామచంద్రపురం నియోజకవర్గ ప్రజల్లో అపారమైన విశ్వాసాన్ని పెంచింది. మాకు కష్టం వస్తే ఆదుకునే కుటుంబం ఉంది అనే భరోసా ప్రజల్లో ఏర్పడటమే వారి సేవా కార్యక్రమాల గొప్పతనానికి నిదర్శనమని స్థానికులు పేర్కొం టున్నారు. రామచంద్రపురం నియోజకవర్గానికే పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అనేక సేవా, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న మంత్రి సుభాష్, వాసంశెట్టి సత్యంలాంటి సేవాభావం కలిగిన నాయకులే సమాజానికి అవసరమని ప్రజలు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. మానవత్వాన్ని రాజకీయాల కంటే గొప్పగా భావించే ఈ తండ్రి- కొడుకులు ప్రజాసేవకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నారు.

## వాకర్స్ యోగ లాఫింగ్ క్లబ్‌కు
# రూ.25 వేలు అందజేత



**రాజమహేంద్రవరం, సెప్టెం బర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** వాకర్స్ యోగ లాఫింగ్ క్లబ్ ద్వారా ప్రతి ఏడాది పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించేం దుకు భవ్య స్కిన్ ఆసుపత్రి అధినేత డాక్టర్ పలివెల హరి నాథ్ 25 వేల రూపాయలు అందజేస్తుంటారు. ఈ మేరకు గురువారం ఆయన ఛాంబర్ లో క్లబ్ వ్యవస్థాపకులు పామర్తి గోపాలరావు, ప్రెసిడెంట్ సత్తిబాబు కి 25 వేలు అందజేశారు. వాకర్స్ యోగ లాఫింగ్ క్లబ్ తరఫున ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు గాడిల్లి సత్యనారాయణ, గీసాల బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

## నందివాడ వారి వీధిలో భక్తి శ్రద్ధలతో
# గణనాధునికి నిత్య పూజలు



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక 23వ డివిజన్లో ఉన్న నందివాడ వారి వీధిలో శ్రీ వజ్ర గణపతి ఆలయ మందిరం వారి శ్రీ లక్ష్మీ గణపతి నవరాత్రి మహోత్సవాలలో భాగంగా నిత్య పూజా కార్యక్రమాలు జరిగాయి. శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాలలో పైలా రాజశేఖర్, రమణి దంపతులచే పూజా కార్యక్రమాలు జరిగాయి.పురోహితులు బోడెం రవి కుమార్ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.సాయంత్రం శ్రీ వెంకటేశ్వర భజన మండలి, చంటి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం జరిగింది.నవరాత్రులు సందర్భంగా ప్రతిరోజు రాత్రి స్వామి వారికి ఏకాదశ హారతులు ఇస్తున్నారు.ఈ కార్యక్రమంలో రుడా మాజీ ఛైర్ పర్సన్ మేడపాటి షర్మిలరెడ్డి, మాజీ కార్పొరేటర్ బెజవాడ రాజ్ కుమార్,చందా సత్రం మాజీ ఛైర్మన్, మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ, పేరూరి మహేంద్రనాథ్,పొత్తూరి యతిరాజ్ సంపత్ కుమార్,సరిదే ధన వెంకటేశ్వరరావు, కనమర్లపూడి చంద్రకాంత్, మారడుగుల సుబ్బయ్య, వానపల్లి మురళీకృష్ణ, నంబూరి కృష్ణ చైతన్య, సోమిశెట్టి భీమేశ్వరరావు, జ్యోతి రామ్ విఠల్ మోరే, వాకచర్ల భరత్ ఫ్రెండ్స్ సర్కిల్ హాజరయ్యారు.

# భారతీయ జవాన్ కిసాన్ పార్టీ జెండా పండుగ



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతీయ జవాన్ కిసాన్ పార్టీ జెండా పండుగ వేడుకలు స్థానిక లాలాచెరువు వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నేషనల్ ప్రెసిడెంట్ సుదర్శి మోహనరావు, నేషనల్ కో ఆర్డినేటర్ బంగారి కృష్ణ మూర్తి, ఓం భారత్ శక్తి పీఠం వ్యవస్థాపకులు భారతానంద మహారాజ్, రాష్ట్ర అధ్యక్షులు కోండ్రు రాజేశ్వరరావు, ఏలూరు జిల్లా అధ్యక్షులు వెంకట రమణ, గుంటూరు జిల్లా అధ్యక్షులు ఆరికూటి సామిరెడ్డి, మహిళా అధ్యక్షురాలు కెవి గోవిందమ్మ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నేషనల్ కో ఆర్డినేటర్ మాట్లాడుతూ నగర ప్రజలకు ఉచిత విద్య, వైద్యం, మంచినీటి సదుపాయాలు తమ పార్టీ ద్వారా కల్పిస్తామని భరోసా ఇచ్చారు. రాజమండ్రి నుంచి రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పోటీచేయాలనుకునే వారికి పార్టీలోకి స్వాగతం పలుకుతున్నామని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ నిజాయితీపరులైన వారు తమ పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. లంచగొండి రహిత సమాజం ఏర్పాడాలన్నదే తమ ముఖ్యమైన మేనిఫెస్టో అని వివరించారు. నేషనల్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ భారతీయ జవాన్ కిసాన్ పార్టీ తొలి జెండా పండుగ కార్యక్రమాన్ని రాజమహేంద్రవరంలో నిర్వహించిందంటే దానికి ముఖ్య కారణం రాయలు పరిపాలించిన ప్రాంతం కావడమేనని తెలిపారు. మిగిలిన అన్ని జిల్లాల్లోనూ పార్టీ సేవలను విస్తరించి ప్రజలను చైతన్యవంతం చేస్తామని, పార్టీతో కలిసి పనిచేసే వారికి అవకాశం కల్పిస్తామని వివరించారు.












ద్రాక్షారామం ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాన్ని

# ఎండోమెంట్ శాఖకు అప్పగించాలన్న నోటీసులపై అభ్యంతరం



**ద్రాక్షారామ, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గంలోని ద్రాక్షారామం శ్రీ భీమేశ్వర స్వామి వారి ఆలయం వెలుపల ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి ఆలయాన్ని ఎండోమెంట్ శాఖకు అప్పగించాలంటూ నోటీసులు జారీ చేయడంపై మాజీ రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, రామచంద్రపురం నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ ప్రశ్నించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నిర్ణయం మేరకు ఎండోమెంట్ శాఖ అడిషనల్ సూపరింటెండెంట్ ఈ నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. 1963లో నిర్మించిన శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి ఆలయం అప్పటి నుంచి ఇప్పటివరకు ఒక ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగుతోందని, ఆలయానికి సంబంధించిన అన్ని కార్యక్రమాలను ట్రస్ట్ సభ్యులే నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ ఆలయానికి ఎలాంటి ఆదాయం లేదని, ఎటువంటి ఆస్తులు కూడా లేవని స్పష్టం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆలయాన్ని ఎండోమెంట్ శాఖకు అప్పగించాలంటూ నోటీసులు జారీ చేయడం ఎంతవరకు సమంజసమని మీడియా సంస్థల ద్వారా ప్రశ్నించారు. ఆలయ చరిత్ర, ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిర్వహణ, ఆలయానికి ఉన్న వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అధికారులు తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# రామచంద్రపురం ఎస్.కె.పి.జి.ఎన్ ఉన్నత పాఠశాలలో ఘనంగా ఎన్.జి.సి. వర్క్‌షాప్




**రామచంద్రపురం, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణంలోని ఎస్.కె.పి.జి.ఎన్ ఉన్నత పాఠశాలలో కె.గంగవరం మరియు రామచంద్రపురం మండలాల పరిధిలోని ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులందరి కొరకు నేషనల్ గ్రీన్ కార్ప్స్ (ఎన్.జి.సి.) ఆధ్వర్యంలో ప్రత్యేక వర్క్‌షాప్ అత్యంత వైభవంగా నిర్వహించబడింది. డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పి. రామలక్ష్మణ మూర్తి పర్యవేక్షణలో సాగిన ఈ కార్యక్రమానికి రామచంద్రపురం ఎస్.కె.పి.జి.ఎన్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.వీరరాఘవ రెడ్డి అధ్యక్షత వహించి ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎన్.జి.సి. కోఆర్డినేటర్ పి.ఆర్.జి.ఎన్.వి. ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి సభికులనుద్దేశించి ప్రసంగించారు. నేటి ఆధునిక కాలంలో మానవ తప్పిదాల వల్ల ప్రకృతికి జరుగుతున్న ముప్పును వివరించారు. ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు విద్యార్థులలో పర్యావరణ స్పృహను పెంపొందించాలని, పర్యావరణ పరిరక్షణను ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించి ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ వర్క్‌షాప్‌లో స్థానిక అధికారులు ఎం.శ్రీనివాసరావు, వి.నాగేశ్వరి, ఎ.నాగరాజు తదితరులు ప్రత్యేక అతిథులుగా పాల్గొని తమ అమూల్యమైన సందేశాలను అందించారు. పాఠశాల స్థాయిలో పర్యావరణ పరిరక్షణ కోసం చేపట్టాల్సిన వివిధ రకాల కార్యక్రమాల గురించి, ప్రభుత్వ పరంగా అందుతున్న సహకారాన్ని వారు వివరించారు. కార్యక్రమంలో భాగంగా రిసోర్స్ పర్సన్ ఎం. రామలక్ష్మి ఎన్.జి.సి. నిర్వహణ విధానం మరియు ప్రకృతి కనెక్ట్ యాప్ యొక్క ప్రాముఖ్యతను, దానిని ఉపయోగించే విధానాన్ని ఉపాధ్యాయులకు సమగ్రంగా వివరించారు. ఉపాధ్యాయులు సైతం ఈ యాప్‌ను విద్యార్థులలో విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. వర్క్‌షాప్ ముగింపు దశలో పర్యావరణ హితమైన పలు ఆచరణాత్మక కార్యకలాపాలను నిర్వహించారు. విద్యార్థుల చేత పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటించడం, ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై విస్తృతమైన అవగాహన కల్పించడం, మట్టితో కూడిన సీడ్‌బాల్స్ (విత్తన బంతులు) మరియు పర్యావరణానికి హాని చేయని విత్తనాల గ్రీటింగ్ కార్డుల తయారీ వంటి వినూత్న కార్యక్రమాలను ఎంతో ఉత్సాహంగా విజయవంతంగా పూర్తి చేశారు.

ద్రాక్షారామలో ఘనంగా 25 ఏళ్లు సేవా సంకల్ప్ అభియాన్,

# ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు



**ద్రాక్షారామ, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం మండలం ద్రాక్షారామలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న 25 ఏళ్లు సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షులు ఆకేటి శ్రీకృష్ణ ఆధ్వర్యంలో, సేవా సంకల్ప్ అభియాన్ జిల్లా కన్వీనర్, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి సతీష్ రావు సమన్వయంతో ఈ కార్యక్రమాలు కొనసాగాయి. ద్రాక్షారామలోని పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రధాని నరేంద్ర మోదీ అభివృద్ధి, సంక్షేమ పథకాల ఎగ్జిబిషన్‌ను ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి, సత్యం ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు విస్తృతంగా కొనసాగుతున్నాయని, దేశాభివృద్ధికి మోదీ నాయకత్వం ఎంతగానో దోహదపడుతోందని పేర్కొంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వాసంశెట్టి సత్యం, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కర్రి చిట్టిబాబు బిజెపి నేతలతో కలిసి కేక్ కట్ చేశారు. ఎగ్జిబిషన్‌లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, రైతులు, మహిళలు, యువత, పేదలు మరియు వివిధ వర్గాల ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను ఆకేటి శ్రీకృష్ణ ప్రజలకు వివరించారు. విచ్చేసిన అతిథులకు మోదీ అందిస్తున్న కేంద్ర ప్రభుత్వ పథకాల బుక్ లెట్ లను బిజెపి నాయకులు అవసరాల వీరవెంకట రమణ మూర్తి, గుర్రాల సత్యనారాయణ, చందు, కొట్టువాడ హరిబాబు, సలాది సతీష్ నాయుడు, గాణాల కళ్యాణ్, రాజేశ్వరి, రాయుడు రామకృష్ణ తదితరులు అందజేశారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ముఖ్య అతిథులు వాసంసెట్టి సత్యం, పెంకే అన్నపూర్ణ సాంబశివరావు, కొత్తపల్లి అరుణ రాంబాబు తదితరులను ఆకేటి శ్రీకృష్ణ ఘనంగా సత్కరించారు. సాయంత్రం శ్రీ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రధాని మోదీ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఆశీర్వాద దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో పుల్లెల రామమూర్తి, అయ్యప్ప, పద్మావతి, సుజాత, ఇంధన సత్యనారాయణ, దక్షిణా మూర్తి, తొలేటి సూర్య, ఆళ్ల నారాయణ తదితర బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ద్రాక్షారామం వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద

# వైభవంగా విశ్వకర్మ యజ్ఞమహోత్సవం, అన్నప్రసాద విందు

**ద్రాక్షారామ, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** ద్రాక్షారామం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద శ్రీ కామాక్షి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17 ఉదయం 9 గంటల నుంచి విశ్వకర్మ యజ్ఞమహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా యజ్ఞం అనంతరం భక్తులకు భారీ ఎత్తున అన్నప్రసాద విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ వేడుకకు గ్రామ పెద్దలు మరియు ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో విచ్చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ శాఖ బాబి, ద్రాక్షారామ మాజీ సర్పంచ్ అరుణ రాంబాబు, మాజీ ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చి రాజు మరియు మాజీ పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు దాకోజు రామకృష్ణ, దమర్ సింగ్ దేవి ప్రసాద్, కోసనా కామేశ్వరరావు, గారోజు సూరిబాబు, కొసనా భీమశంకరం అలాగే శ్రీ కామాక్షి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొసనా భీమశంకరం, ఉపాధ్యక్షుడు దాకోజు వీరబాబు, సెక్రెటరీ దాకోజు శ్రీనివాస్ మరియు విశ్వబ్రాహ్మణ సోదరులు, పెద్దలందరి పూర్ణ ఆశీస్సులతో ఈ యజ్ఞమహోత్సవం దిగ్విజయంగా ముగిసింది.

మోదీ నాయకత్వంలో

# భారత్ విశ్వగురువుగా నిలవాలి

అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు



**అమలాపురం, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా అమలాపురంలో గురువారం వేడుకలు నిర్వహించారు. మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కూటమి నాయకులతో కలిసి దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ భారతదేశాన్ని విశ్వగురువుగా నిలిపే సంకల్పంతో నరేంద్ర మోదీ నిరంతరం దేశ సేవకు అంకితమై పనిచేస్తున్నారని తెలిపారు. మోదీ దూరదృష్టి, నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. దేశ సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి భగవంతుడు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ప్రత్యేకంగా ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# కౌశలం ప్లేస్‌మెంట్స్ డ్రైవ్‌లో నేడు ఇంటర్వ్యూలు



**అమలాపురం, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** కౌశలం ప్లేస్‌మెంట్స్ డ్రైవ్‌లో భాగంగా ఎంఎస్ఎన్ లేబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ఉద్యోగ అవకాశాల కోసం ఎంపికైన అభ్యర్థులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్‌జీఎస్‌డబ్ల్యూ అధికారి తెలిపారు. అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న గోదావరి భవన్‌లో సెప్టెంబర్ 18న ఉదయం 8.30 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఈ ప్లేస్‌మెంట్స్ డ్రైవ్ ద్వారా ఎంఎస్ఎన్ లేబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగ స్థలం హైదరాబాద్‌లో ఉంటుందని వెల్లడించారు. ఈ ప్లేస్‌మెంట్స్ డ్రైవ్‌కు సంబంధించి మొత్తం 501 మంది అభ్యర్థులతో జాబితా సిద్ధం చేసినట్లు తెలిపారు. సంబంధిత ఎంఎస్‌జీవోలు, యూఎస్‌డబ్ల్యూవోలు తమ పరిధిలోని అభ్యర్థులను వెంటనే సంప్రదించి ఇంటర్వ్యూ తేదీ, సమయం, వేదిక వివరాలను తెలియజేయాలని ఆదేశించారు. ఎంపికైన అభ్యర్థులు శుక్రవారం ఉదయం 8.30 గంటలకు అమలాపురం కలెక్టర్ కార్యాలయంలోని గోదావరి భవన్‌కు తప్పనిసరిగా హాజరై ఈ ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అధికారులు కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా అతిథి ఉపన్యాసం,

# విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేత



**రామచంద్రపురం, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్థశాస్త్ర, వాణిజ్య శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో అతిథి ఉపన్యాసం ఏర్పాటు చేయడం జరిగింది. సి.ఎస్.టి.ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జంగారెడ్డి గూడెం ఎకనామిక్స్ అధ్యాపకులు బి.శ్రీనివాసరావు విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై మరియు ఆర్థిక శాస్త్రం యొక్క పాత్రను వివరించారు. విద్యార్థులతో ముఖాముఖీ చర్చలో ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థులకు బి.శ్రీనివాసరావు రూ. 1500 చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతులు అందించారు. అదేవిధంగా ఎకనామిక్స్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతి సంవత్సరం ప్రోత్సాహక బహుమతి ఇవ్వడానికి గాను పదివేల రూపాయలు కళాశాలకు అందిస్తానన్న విషయాన్ని తెలియజేశారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు శ్రీనివాసరావు తెలియజేసిన ఈ నిర్ణయానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. చిట్టిబాబు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమం చరిత్ర మరియు వాణిజ్య శాస్త్ర అధిపతి డాక్టర్ బి. నాగరాజు ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇతర అధ్యాపకులు జి.ఎస్. దుర్గారావు, రాజేష్, చిరంజీవి మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీల్లో వాగ్దేవి పాఠశాల వ్యాయామోపాధ్యాయుడి ప్రతిభ



**అమలాపురం టౌన్, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో గత శని, ఆదివారాల్లో నిర్వహించిన 44వ ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ మాస్టర్స్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్-2026 పోటీల్లో అమలాపురం శ్రీ వాగ్దేవి పాఠశాల వ్యాయామోపాధ్యాయుడు రాజేష్ ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా తరపున పాల్గొన్న రాజేష్ హైజంప్, డిస్కస్ త్రో విభాగాల్లో తృతీయ స్థానాలు సాధించి పతకాలు గెలుచుకున్నారు. అలాగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలలో వ్యాయామోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూనే తక్కువ సమయంలో సాధన చేసి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడం అభినందనీయమని పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రిష్టి శ్రీరామచంద్రమూర్తి అన్నారు. ఆయన విజయం విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా నిలిచి, కోయంబత్తూరులో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమనే విషయాన్ని రాజేష్ తన ప్రతిభతో నిరూపించారని తెలిపారు. పాఠశాల డైరెక్టర్ పరసా భరత్ రాజేష్‌ను అభినందిస్తూ, జాతీయస్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
కాకినాడ జిల్లా ఎడిషన్
శుక్రవారం, 18 సెప్టెంబర్ 2026
www.viswamvoice.com



## తేటగుంట సమీపంలో రోడ్డు ప్రమాదం..

# పెళ్లి బస్సును ఢీకొట్టిన కంటైనర్ లారీ

పెళ్లి బృందానికి రోడ్డు ప్రమాదం భయాందోళన


ప్రమాదానికి గురైన పెళ్లి బస్సు


కంటైనర్ లారీ ఢీకొన్న తీరు

**తుని నుంచి ఉప్పాడకు వెళ్తుండగా ఘటన**

- తునిలో పెళ్లి వేడుకలు ముగించుకుని ఉప్పాడకు బయలుదేరిన పెళ్లి బృందం
- మార్గమధ్యలో రాజులకోత్తూరు దగ్గరికి రాగానే వెనుక నుంచి ట్రక్కు ఢీకొన్నది
- బస్సులో దాదాపు 30 మంది ప్రయాణికులు
- కోంతమందికి స్వల్పంగా గాయాలు



**కోటనందూరు, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** తునిలో పెళ్లి వేడుకను ఆనందంగా ముగించుకుని, ఉప్పాడకు తిరుగు ప్రయాణమైన పెళ్లి బృందానికి రోడ్డు ప్రమాదం రూపంలో అవాంతరం ఎదురైంది. వారు ప్రయాణిస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును వెనుక నుంచి వచ్చిన కంటైనర్ ట్రక్కు బలంగా ఢీకొట్టింది.కాకినాడ జిల్లా,తుని మండలం, తేటగుంట సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు మరియు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తునిలో వివాహం ముగించుకున్న సుమారు 30 మందితో కూడిన పెళ్లి బృందం ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో ఉప్పాడకు బయలుదేరింది. మార్గ మధ్యలో రాజుల కొత్తూరు దగ్గరకు వచ్చేసరికి, వెనుక నుంచి వచ్చిన ట్రక్కు అదుపుతప్పి ఆ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో దాదాపు 30 మంది ప్రయాణికులు ఉన్నారు. కంటైనర్ ఢీకొనడం వల్ల బస్సులో ఉన్న కొంతమంది ప్రయాణికులకు స్వల్పంగా దెబ్బలు తగిలాయి. పెళ్లి ఆనందంతో వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరగడంతో బస్సులోని వారు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు మరియు స్థానికులు స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని వెంటనే మెరుగైన వైద్యం కోసం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు వారికి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదం కారణంగా ఆ మార్గంలో కొద్దిసేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి, వాహనాల రాకపోకలను సులభతరం చేశారు.

# తునిలో భారీగా గంజాయి పట్టివేత

**నలుగురు అరెస్టు, రూ.62.5 లక్షల విలువైన 125 కేజీలు గంజాయి స్వాధీనం**



**కోటనందూరు, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా, తుని పట్టణంలో భారీగా గంజాయి రవాణా గుట్టు రట్టయింది. సీతారాంపురం ప్రాంతంలో ఒక ఇంటిని అడ్డాగా చేసుకొని గంజాయి రవాణాకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను తుని పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి 125 కేజీల గంజాయితో పాటు రూ.3 లక్షల 41 వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.62 లక్షల 50 వేలుగా పోలీసులు అంచనా వేశారు. గంజాయి రవాణాకు ఉపయోగించిన ఒక ఎర్టిగా కారు, ఒక ఆటోతో పాటు రెండు మోటార్ సైకిళ్లను పోలీసులు సీజ్ చేశారు. ఈ ఘటనపై కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాలతో కేసు నమోదు చేసిన పోలీసులు.. కేసు వివరాలను పెద్దాపురం డి.ఎస్.పి తిలక్ మీడియాకు వివరించారు. గంజాయి ఎక్కడి నుంచి తీసుకొచ్చారు, ఎక్కడికి తరలిస్తున్నారు అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కాకినాడ నగరపాలక సంస్థ నూతన కార్యాలయ

# భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

**నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్**



**కాకినాడ, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ నగరపాలక సంస్థ నూతన కార్యాలయ భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్దేశిత సమయం లోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కాకినాడ జిల్లా కలెక్టర్, కార్పొరేషన్ ప్రత్యేక అధికారి ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం సినిమా రోడ్డులో నిర్మాణంలో ఉన్న కాకినాడ నగరపాలక సంస్థ నూతన కార్యాలయ భవనాన్ని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సంస్థ అధికారులు ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ పనులు జరుగుతున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణంలో చేపట్టిన వివిధ పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న దశ, తదుపరి చేపట్టాల్సిన పనుల వివరాలను ఈ సందర్భంగా ఆయన కమిషనర్ సత్యనారాయణ అడిగి తెలుసుకున్నారు. కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ కలెక్టర్‌కు నూతన కార్యాలయ భవన నిర్మాణ పనుల పురోగతిని వివరించారు. ఇప్పటి వరకు పూర్తయిన పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణ పనులు, మిగిలి ఉన్న పనులపై వివరాలను అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ నూతన కార్యాలయ భవన నిర్మాణ పనులు ఆలస్యం కాకుండా వేగవంతంగా చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. నిర్మాణ పనులలో అవసరమైన సమన్వయంతో ముందుకు సాగాలని, నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భవన నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. నగరపాలక సంస్థ నూతన కార్యాలయ భవన నిర్మాణం పూర్తయితే నగర పాలక సంస్థకు సంబంధించిన పరిపాలనా కార్యకలాపాలకు మరింత అనుకూలమైన వసతులు అందుబాటు లోకి రానున్నాయని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో నిర్మాణ పనుల పురోగతిపై కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ఈ పరిశీలన జిల్లా కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.వెంకట్రావు, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ఖచ్చితత్వంతో పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**



**కాకినాడ, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-2026 ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిష్పక్ష పాతంగా ఖచ్చితత్వం తో నిర్వహించి నిర్దేశిత కాల పరిమితిలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అసెంబ్లీ నియోజక వర్గాల ఎన్నికల అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్ల తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పురోగతిపై జిల్లాల వారీగా సమీక్షించారు.నోటీసుల జనరేషన్, నోటీసుల డెలివరీ స్థితిగతులు, విచారణల పురోగతి, తుది ప్రచురణకు సం బంధించిన ప్రక్రియ, ఫోటో క్వాలిటీ చెక్, ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల స్వీకరణ, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, 'బుక్ ఏ కాల్ విత్ బీఎల్ఓ' కార్యక్రమం పురోగతి, నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్ లో నమోదైన ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి జిల్లాల వారీగా సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో క్లెయిమ్స్ అండ్ ఆబ్జెక్షన్స్ పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి,అర్హత కలిగిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.అక్టోబర్ 5 నాటికి క్లెయిమ్స్ పరిష్కారం క్లెయిమ్స్ డిస్పోజల్ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం తుది ఓటర్ల జాబితా ప్రచురణకు అవసరమైన అన్ని ప్రక్రియ లను పూర్తి చేసి అక్టోబర్ 9 వ తేదీ నాటికి ఎన్నికల జాబితాను తుది ప్రచురణ కు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఎన్నికల జాబితా రూపకల్పనలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలోఉండేలా,అనర్హులు లేదా నిబంధనలకు విరుద్ధంగా నమోదైన వివరాలను నిబంధనల మేరకు సరి చేసేలా చర్యలు చేపట్టాలనిసూచించారు. ఫారం-6, 7, 8 దరఖా స్తులపై ప్రత్యేక దృష్టి ఫారం-6, ఫారం-7, ఫారం-8లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తు లపైప్రత్యేకదృష్టిసారించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.దరఖాస్తుల ను నిర్ణీత గడువులో విచారించి అవసరమైన పరిశీలన ధ్రువీకరణ అనంతరం నిబంధనల మేరకు నమోదు,తొలగింపు లేదా సవరణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి దరఖాస్తు పరిష్కా రంలో పారదర్శకత పాటించాలని, సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, ఫీల్డ్ స్థాయిలో అవసరమైన పరిశీలనలు పూర్తి చేసి తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు.'బుక్ ఏ కాల్ విత్ బీఎల్ఓ' కార్యక్రమం ద్వారా అందిన దరఖాస్తులు, అభ్యర్థనలు, ఫిర్యాదులపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న 9 క్లెయిమ్స్‌ను త్వరితగతిన పరిశీలించి పరిష్కరిం చాలనిఆదేశించారు.బూత్ స్థాయి అధికారులు తమ పరిధిలోని ఓటర్లతో సమన్వయం చేసు కుంటూ, ఓటర్ల వివరాల్లో మార్పులు, చిరునామా మార్పులు, కొత్తగా ఓటరు నమోదులు, తొలగిం పులు తదితర అంశాలను నిబంధనల ప్రకారం పరిశీలించాలని సూచిం చారు.నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్‌లో నమోదైన ఫిర్యాదులపై కూడా కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 5 ఫిర్యాదులను నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని అధికా రులను ఆదేశించారు. ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును నిర్ణీత కాలవ్యవధిలో పరిశీలించి, సముచిత పరిష్కారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచిం చారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ- 2026 ప్రక్రియలో ప్రతి దశను ఎన్నికల సంఘం మార్గ దర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని, అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువుల్లో అన్ని ప్రక్రియలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో డాక్టర్ డి.తిప్పే నాయక్,నియోజకవర్గ ఎన్నికల అధికారులు, పెద్దాపురం ఆర్డీవో పి. కృష్ణమూర్తి,కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ. శ్రీనివాస రావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.



# దివ్యాంగ విద్యార్థికి ట్రై సైకిల్ అందజేసిన మంత్రి కందుల దుర్గేష్

**పుట్టినరోజున ఆపన్నహస్తం**

**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** పుట్టినరోజు వేడుకలంటే సాధారణంగా ఆర్భాటాలు, వేడుకలే కనిపిస్తాయి. కానీ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ తన పుట్టినరోజును సార్థకం చేసుకుంటూ మరోసారి తనలోని సహృదయతను, మానవత్వాన్ని చాటుకున్నారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న పీయూష్ అనే దివ్యాంగ విద్యార్థి పడుతున్న ఆవేదనను, నిత్యం ఎదుర్కొంటున్న శ్రమను గుర్తించిన మంత్రి దుర్గేష్ తన మిత్రుని సహకారంతో ఆ విద్యార్థికి ఒక ట్రై సైకిల్‌ను మంజూరు చేసి స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడూ... "శారీరక వైకల్యం అనేది విద్యార్థి ఆశయాలకు ఏమాత్రం అడ్డంకి కాకూడదు. ఈ వాహనం పీయూష్‌కి కేవలం ప్రయాణ సాధనం మాత్రమే కాదు... అతని ఆత్మవిశ్వాసానికి, నిత్య జీవిత చక్రానికి కొండంత ధైర్యం. పీయూష్ మరింత కష్టపడి చదివి సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి"అని ఆకాంక్షించారు.మంత్రి దుర్గేష్ చేతుల మీదుగా ట్రై సైకిల్ అందుకున్న విద్యార్థి పీయూష్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. నిత్యం కాలేజీకి వెళ్లడానికి, రోజువారీ పనులకు పడుతున్న అవస్థలను గుర్తుచేసుకుంటూ"నా కష్టాన్ని గుర్తించి, నా చదువుకు కొత్త ఊపిరి పోసిన మంత్రి దుర్గేష్ రుణం తీర్చుకోలేను. ఈ రోజు నా జీవితంలో మరచిపోలేని రోజు" అని భావోద్వేగంతో కృతజ్ఞతలు తెలియజేశారు.సమాజంలో కష్టాల్లో ఉన్నవారికి చేయూతనందించడమే నిజమైన పుట్టినరోజు పండుగ అని నిరూపించిన మంత్రి దుర్గేష్ ను, ఈ సత్కార్యానికి సహకరించిన వారిని పలువురు నెటిజన్లు, స్థానికులు హృదయపూర్వకంగా అభినందిస్తున్నారు.



# దేవీచౌక్‌లో అంగరంగ వైభవంగా పందిరిరాట మహోత్సవం

**రాజమహేంద్రవరంలో దసరా నవరాత్రి ఉత్సవాలకు పవిత్ర అంకురార్పణ - ఆహ్వానితుడిగా హాజరై ప్రత్యేక పూజలు చేసిన కంబాల శ్రీనివాసరావు**



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** చారిత్రక నగరం రాజమహేంద్రవరంలో దసరా నవరాత్రి ఉత్సవాల కోలాహలం మొదలైంది. తూర్పుగోదావరి జిల్లా దేవీచౌక్‌లో కొలువుదీరనున్న శ్రీ బాలా త్రిపుర సుందరి దేవీ అమ్మవారి ఉత్సవాలకు గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో పందిరిరాట మహోత్సవాన్ని నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణలు, భక్తుల నామస్మరణ మధ్య ఈ ఘట్టం అత్యంత వైభవంగా జరిగింది. రాబోయే దసరా పండుగను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు పూర్తి స్థాయి సన్నాహాలు ప్రారంభించారు. ఈ పవిత్ర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గం బీఎల్‌ఏ-1 కంబాల శ్రీనివాసరావు ఉత్సవ కమిటీ ప్రత్యేక ఆహ్వానం మేరకు హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆయన పందిరిరాట ప్రతిష్టాపన కార్యక్రమంలో స్వయంగా పాల్గొని ప్రత్యేక పూజలు ఆచరించారు.రాజకీయ, సామాజిక రంగాల్లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కంబాల శ్రీనివాసరావు, హైందవ ధర్మ పరిరక్షణ కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారు. విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన ద్వారా ఆయన చేస్తున్న సేవలు అనంతం. యువతలో ఆధ్యాత్మిక భావాలు పెంపొందించడం, దేవాలయాల అభివృద్ధికి తోడ్పడటం, పేదలకు అన్నదానాలు, విద్యా వైద్య పరమైన సహాయ సహకారాలు అందించడంలో ఆయన ఎప్పుడూ ముందు వరుసలో ఉంటారు.పందిరిరాట మహోత్సవంలో పాల్గొన్న అనంతరం కంబాల శ్రీనివాసరావు భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ తన అంతరంగాన్ని ఆవిష్కరించారు. సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యం వెల్లివిరిసినప్పుడే మానవతా విలువలు బతుకుతాయని స్పష్టం చేశారు. నవరాత్రి ఉత్సవాలు కేవలం పండుగలు మాత్రమే కాదని, ప్రజలందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి భక్తిభావంతో ఏకం చేసే మహత్తర సాధనాలని ఆయన అభివర్ణించారు. కనకదుర్గమ్మ ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, సిరిసంపదలతో తులతూగాలని మనసారా ప్రార్థించారు. భక్తిప్రపత్తులతో సాగిన ఈ పందిరిరాట కార్యక్రమంతో రాజమహేంద్రవరం నగరంలో పండుగ వాతావరణం నెలకొంది.

# రూ.48 లక్షలతో సీసీ రోడ్డు పునరుద్ధరణకు శంకుస్థాపన



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక 34వ డివిజన్ శేషయ్యమెట్టలోని న్యూ కోర్టు కాంప్లెక్స్ నుంచి ఆర్‌డబ్ల్యూఎస్ కార్యా లయం వరకు రూ.48 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పున రుద్ధరణ పనులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగ రంలోని ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంలో భాగంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రోడ్లను అభివృద్ధి చేయడంతో పాటు డ్రైనేజీ, పారిశుద్ధ్యం, తాగునీరు వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారి స్తున్నామన్నారు. నగరంలోని వివిధ డివిజన్లలో స్థానికంగా ఉన్న సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరించేలా అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. నాణ్యతా ప్రమాణాలను పాటి స్తూ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికా రులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఇటీవల నగరంలో కూడా పలు అభి వృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారం భోత్సవాలు చేశామన్నారు. ఇటీవల 34వ డివిజన్‌లోనే వాసవి శ్రీ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ సమీపం లోని నల్లా ఛానెల్ పంప్‌హౌస్ నుంచి పుష్కర ఘాట్ వరకు రూ.2 కోట్లతో పైపులైన్ ఏర్పాటు పనులకు శ్రీకారం చుట్టామని గుర్తు చేశారు. ఈ పనుల ద్వారా మురుగునీరు గోదావరిలో కలిసే పరిస్థితిని నివారించి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థకు అనుసంధానం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రాబోయే గోదా వరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని నగరంలో మౌలిక వసతుల అభివృద్ధికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నామ న్నారు. 34వ డివిజన్‌లోచేపడుతున్న రూ.48 లక్షల సీసీ రోడ్డు పునరుద్ధరణ పనులు పూర్తయితే న్యూ కోర్టు కాంప్లెక్స్, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వైపు రాకపోకలు సాగించే ప్రజలకు రహదారి సౌకర్యం మెరుగుపడనుందన్నారు. స్థానిక ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, నగర పాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

# వినాయక శిబిరాలను సందర్శించిన జక్కంపూడి రాజా



**సీతానగరం, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం గ్రామంలో ఏర్పా టు చేసిన పలు వినాయక చవితి శిబిరాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు, రాజానగరం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా గురువారం సందర్శిం చారు.ఆయా శిబిరాల్లో ప్రతిష్ఠించిన గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వినాయక విగ్రహాలకు పుష్పాలు సమర్పించారు.జక్కంపూడి రాజా ఆయా వినాయక శిబిరాలకు చేరుకున్న సందర్భంగా కమిటీ నిర్వాహకులు, స్థానిక యువకులు, భక్తులు ఆయనకు సాదర స్వాగతం పలికారు.వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగాలని రాజా ఆకాంక్షిం చారు.ఈ కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, స్థానిక భక్తులు పాల్గొ న్నారు

# పనిభారం పెరిగింది.. వేతనాలు పెరగలేదు

**వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని ధర్నా**



**రాయవరం, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ వీఆర్‌ఏలు చేపట్టిన సహాయ నిరాకరణ నిరవధిక సమ్మెలో భాగంగా గురువారం రాయవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మండల వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు చంద్రమళ్ల వీరబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో వివిధ గ్రామాలకు చెందిన వీఆర్‌ఏలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వీఆర్‌ఏల సమస్యలు పరిష్కారం కాలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించినప్పటికీ ఇప్పటివరకు న్యాయం జరగలేదన్నారు. గత నెల 19న సీసీఎల్‌ఏ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి వినతిపత్రం అందించినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. వీఆర్‌ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, అర్హతను బట్టి వీఆర్వోలు, అటెండర్లు, నైట్ వాచ్‌మెన్లుగా పదోన్నతులు కల్పించాలని, నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్‌ఏలుగా నియమించాలని డిమాండ్ చేశారు. రీ-సర్వే తదితర పనుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తున్నందున అదనపు పనిభారానికి అనుగుణంగా టీఏ, డీఏలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం గౌరవ అధ్యక్షుడు షేక్ ఖాశీం, సెక్రటరీ వి. విక్కీ కోశాధికారి రామకృష్ణ, డివిజన్ అధ్యక్షుడు ఖండవిల్లి రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

# మోదీ పుట్టినరోజున మార్కండేయస్వామి గుడిలో ప్రత్యేక పూజలు



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం తూర్పుగోదావరి జిల్లా భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో రాజమండ్రి గోదావరి గట్టున ఉన్న స్వయంభు శ్రీ ఉమా మార్కండేయ స్వామి ఆలయంలో నరేంద్రమోదీ పేరిట ప్రత్యేక అర్చన నిర్వహించి, అఖండ జ్యోతిని వెలిగించారు.గత ఇరవై ఐదు సంవత్సరాలుగా రాష్ట్ర, దేశ స్థాయిలో సుపరిపాలన అందిస్తూ, దేశ సుభిక్షం కోసం నిరంతరం శ్రమిస్తూ, ప్రజాసేవకు, దేశ రక్షణకు తన జీవితాన్ని అంకితం చేస్తున్న నరేంద్రమోదీకి సేవా సంకల్ప అభియాన్ లో భాగంగా దేశవ్యాప్తంగా ప్రజలు ఆశీర్వాద దీపాలు వెలిగిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు.ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా మహిళా మోర్చా తరఫున తాము చేపట్టిన ఈ కార్యక్రమాన్ని కేవలం ఈ ఒక్క రోజుకే పరిమితం చేయకుండా, మోదీ తదుపరి జన్మదినం వరకు 365 రోజుల పాటు ప్రతిరోజూ ఆయన పేరిట అర్చన నిర్వహిస్తూ, అఖండ జ్యోతిని నిరంతరాయంగా వెలిగించనున్నామని మహిళా మోర్చా నాయకులు తెలిపారు.నరేంద్రమోదీ ఆయురారోగ్యాలతో, మరింత శక్తితో దేశానికి సేవలందించాలని శ్రీ ఉమా మార్కండేయ స్వామిని ప్రార్థిస్తూ, హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పాలడుగుల శ్రీవిద్య, ప్రధాన కార్యదర్శి పుల్లలచెరువు కమల కుమారి, మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు పిడికిట సంజన,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కురగంటి సతీష్, మాజీ కార్పొరేటర్ ఈశ్వరి, గోదావరి జోన్ మహిళా మోర్చా ఇంచార్జ్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత హీ సేవాలో

# నగరాన్ని మేటిగా నిలుపుదాం

**భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన సమాజాన్ని అందిద్దాం : కమిషనర్ రాహుల్ మీనా**



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వచ్ఛత హీ సేవా - 2026 కార్యక్రమం అమలులో రాజమహేంద్రవరం నగరాన్ని అగ్రగామిగా నిలుపుదామని కమిషనర్ రాహుల్ మీనా పిలుపునిచ్చారు. గురువారం నగరపాలక సంస్థ పీజీఆర్‌ఆర్‌ఎస్ హాల్ నందు స్వచ్ఛత హీ సేవా - 2026 కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ స్ఫూర్తితో ప్రతి ఏడాది స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజులపాటు నిర్వహించనున్న 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాన్ని ఒక సామాజిక ఉద్యమంగా నిర్వహించాలన్నారు. ఈ ఏడాది ప్రచార కార్యక్రమం 'స్వచ్ఛతా మే సహభాగ్', 'స్వచ్ఛ భారత్', 'వికసిత్ భారత్' అనే నినాదంతో నిర్వహించుకుంటున్నట్లు వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల సహకారం ఎంత ముఖ్యమని ఈ సందర్భంగా కమిషనర్ పేర్కొన్నారు. పారిశుధ్య నిర్వహణకు ప్రజారోగ్య కార్మికులు ఉన్నప్పటికీ ప్రజల భాగస్వామ్యం ఉంటేనే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. కనుక సంపూర్ణ పారిశుధ్య కార్యక్రమాలలో ప్రజలందరూ భాగస్వాములయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై చెత్త వేయకుండా ఇంటికి వచ్చే చెత్త సేకరణ వాహనానికి తడి,పొడి చెత్తలను వేరుచేసి అందించేలా అవగాహన కలిగించాలన్నారు. అపారిశుధ్యం కారణంగా వ్యాధుల వ్యాప్తి, అనారోగ్య పరిస్థితులపై ప్రజలను తెలియజేయాలన్నారు. అలాగే పౌరులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, యువత, మహిళా సంఘాలు పెద్దఎత్తున కార్యక్రమాలలో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన సమాజాన్ని అందించడమే మన అందరిపై ఉన్న గురుతరమైన బాధ్యత అని స్పష్టం చేశారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, ఎంహెచ్‌ఓ వినూత్న, ఈఈ మాధవి, మేనేజర్ అబ్దుల్ మలిక్, శానిటరీ సూపర్ వైజర్లు శ్రీనివాస్, రామలింగారెడ్డి, సీఎంఎం రామలక్ష్మి, శానిటరీ ఇన్స్ పెక్టర్లు, సెక్రటరీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రన్న సంచార చికిత్స శిబిరాన్ని

# తనిఖీ చేసిన డాక్టర్ కోమల



**సీతానగరం, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరజిల్లా సీతానగరం మండలం ఇనుగంటి వారి పేట ఆయుష్మాన్ ఆరోగ్య మందిర వద్ద జరుగుతున్న చంద్రన్న సంచార చికిత్స శిబిరాన్ని తూర్పుగోదావరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా.పి.కోమల ఆకస్మికంగా తనిఖీ చేసి ఆరోగ్య సేవలు ప్రజలకు ఏ విధంగా అందుతున్నాయో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ "సేవా సంకల్ప అభియాన్-2026 కార్య క్రమంలో భాగంగా సమాజంలో ఉన్న ప్రతి వ్యక్తికి ఆరోగ్య సేవలు అందించాలని,ఆరోగ్య కార్యక్రమా ల్లో ప్రజలను భాగస్వాములను చేయాలని, వ్యాధుల నివారణ మరియు నిర్మూలన గురించి, పౌష్టికాహారం ఆవశ్యత గురించి, ఆరోగ్యకర జీవనశైలిని కలిగి ఉండడం గురించి,పరిసరాల పరిశుభ్రత పాటించడం గురించి ప్రజలకు అవగాహన కలిగించాలని సిబ్బందిని ఆదేశించారు. తదుపరి 2027 గోదావరి పుష్కరాలు ముం దస్తు ప్రణాళికల కోసం మండలం లోని మునికూడలి,ముగ్గళ్ళ, వంగ లపూడి గాట్లను సందర్శించడం జరిగినది. ఈ కార్యక్రమంలో డాక్టర్ జగదీష్, ఎం.పి.హెచ్.ఇ.ఓ లు పి.ఎస్ఎస్.నాగు, వై.ఎస్.రాయుడు, ఎమ్.ఎల్.హెచ్.పి కృష్ణవేణి, హెల్త్ అసిస్టెంట్ ఎస్ నగేష్‌బాబు, ఎ.ఎన్.ఎమ్.ఎన్.ప్రశాంతి కుమారి, కె.కృష్ణవేణి, డి.ఇ.వో మూర్తి,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజానగరం నియోజకవర్గంలో టిడిపికి బిగ్ షాక్

**వైఎస్సార్‌సీపీలో చేరిన సీనియర్ టిడిపి నేత, మాజీ సర్పంచ్ బండి హరిబాబు**



**సీతానగరం, సెప్టెంబర్ 17, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బొడ్డు వెంకటరమణ చౌదరి ఇన్చార్జిగా వ్యవహరిస్తున్న రాజానగరం నియోజక వర్గంలో టిడిపికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సీతానగరం మండలం మునికూడలి గ్రామానికి చెందిన సీనియర్ టిడిపి నేత, మాజీ సర్పంచ్ బండి హరిబాబు బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సమక్షంలో హరిబాబు తన 100 మంది అనుచరులతో కలిసి పార్టీ కండువా కప్పుకున్నారు ఇదే కోవలో టిడిపిలో బలమైన సామాజిక వర్గం నుండి వైసీపీ కండువా కప్పుకోవడానికి ప్రధాన నేతలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.


విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
సువర్ణావకాశం
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం

# ది ప్యారడైజ్ : వేరొక టైటిల్ ఇదే.. పూనకాలే అంటున్న నాని..!




న్యాచురల్ స్టార్ నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ అంచనాల చిత్రం 'ది ప్యారడైజ్' సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత వీరిద్దరి కాంబోలో వస్తున్న సినిమా కావడంతో దీనిపై ప్రేక్షకుల్లో విపరీతమైన క్రేజ్ నెలకొంది. శ్రీలక్ష్మి వెంకటేశ్వర సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో కాయదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, రాఘవ్ జుయల్, మంచు మోహన్ బాబు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నాడు. అయితే, ఈ సినిమాలో నాని తల్లి పాత్రలో ప్రముఖ నటి సొనాలి కులకర్ణి నటించారు. ఇటీవల జరిగిన ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో యాంకర్ ప్రదీప్ ఈ పాత్ర గురించి ప్రశ్నించగా, నాని స్పందిస్తూ చేసిన కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. "ఈ సినిమాకి 'ది ప్యారడైజ్' కాకుండా వేరొక టైటిల్ పెట్టాల్సి వస్తే 'సమ్మక్క' అని పెట్టేవారమని.. ఇది పూర్తిగా ఆమె చిత్రమే" అని నాని పేర్కొన్నాడు. నాని ఇచ్చిన ఈ స్టేట్‌మెంట్‌తో సినిమాలో తల్లి పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉండబోతోందో అర్థమవుతోంది. ఒకవేళ నిజంగానే 'సమ్మక్క' అనే టైటిల్ పెట్టి ఉంటే ప్రేక్షకులకు పూనకాలు రావడం ఖాయమని ఆయన అభిప్రాయపడ్డాడు.

# 'జాకీ'గా మారిన ధృవ్..

## సాలిడ్ అప్డేట్‌కు టైమ్ ఫిక్స్..!

తమిళ స్టార్ హీరో చియాన్ విక్రమ్ తనయుడు, యంగ్ టాలెంటెడ్ హీరో ధృవ్ విక్రమ్ కొత్త మూవీని ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. కరణ్ ఎ. కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ డ్రామాకి 'జాకీ' అనే టైటిల్‌ను తాజాగా ఖరారు చేశారు మేకర్స్. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన ఓ సాలిడ్ అప్‌డేట్‌ను సెప్టెంబర్ 18న సాయంత్రం 4:05 గంటలకు రివీల్ చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ మ్యూజిక్ అందిస్తుండటం విశేషం. ధృవ్ విక్రమ్ మాస్ అండ్ ఇంటెన్స్ లుక్‌తో రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో అలాగే అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మరి రేపు రాబోయే అప్‌డేట్‌తో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరగడం ఖాయంగా కనిపిస్తోంది.




## సత్యదేవ్ 'సమవర్తి' టీజర్‌కు డేట్ ఫిక్స్.. ఎప్పుడంటే..?




వర్సెటైల్ యాక్టర్ సత్యదేవ్ ప్రస్తుతం సెలెక్టివ్‌గా సినిమాలు చేస్తున్నాడు. ఆయన ఈసారి సరికొత్త వైల్డ్ అవతార్‌లో అలరించేందుకు సిద్ధమయ్యాడు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'సమవర్తి'కి సంబంధించిన సాలిడ్ అప్‌డేట్‌ను చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. విల్లు పట్టిన పవర్‌ఫుల్ అండ్ ఇంటెన్స్ లుక్‌తో ఉన్న పోస్టర్‌ను షేర్ చేస్తూ, ఈ సినిమా టీజర్‌ను సెప్టెంబర్ 19న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. అజయ్ నాగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను రుద్ర పిక్చర్స్ మరియు పంచభూత ఫిలింస్ బ్యానర్లపై జక్కిడి శివారెడ్డి, శశిధర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో దిలీష్ పోతన్, రాజీవ్ కనకాల, రవీంద్ర విజయ్ ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. సత్యదేవ్ కెరీర్‌లోనే అత్యంత వైల్డ్ అండ్ డిఫరెంట్ క్యారెక్టర్‌గా రాబోతున్న ఈ 'సమవర్తి' టీజర్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రానికి సింజిత్ యెర్రమిల్లి సంగీతం అందిస్తున్నాడు.



## రామ్ పోతినేని క్రేజీ ప్రాజెక్ట్‌లో విలన్ ఎవరో తెలుసా!?

ప్రస్తుతం మన టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా తన స్వీయ దర్శకత్వంలోనే ఓ భారీ సినిమా చేస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. ఓ ఇంట్రెస్టింగ్ థ్రిల్లర్ యాక్షన్ డ్రామాగా రామ్ దీన్ని డిజైన్ చేసుకున్నాడు. రోజుల తరబడి గ్యాప్ లేకుండా వరుస షూట్ తో కొనసాగిస్తున్న ఈ సినిమాలో విలన్ గా ఎవరు కనిపిస్తారు అనేది తెలుస్తోంది. ఈ సినిమాలో విలన్ రోల్ కోసం మొదట కోలీవుడ్ నటుడు ఎస్ జే సూర్యని సంప్రదించారు అట. కానీ బేరసారాలు తెగకపోవడంతో ఈ రోల్ బాలీవుడ్ నటుడు, ప్రముఖ నటి జెనీలియా భర్త రితేష్ దేశ్ ముఖ్ ఫైనల్ అయినట్లు తెలుస్తోంది. సో రామ్ ని ఢీ కొట్టే విలన్‌గా ఈ నటుడు కనిపిస్తాడు అని చెప్పొచ్చు. ఇది వరకు రామ్, జెనీలియా కలిసి నటించిన సంగతి తెలిసిందే. ఈసారి ఆమె భర్త రామ్ కి విలన్ గా కనిపించనున్నాడు. ఇక దీనిపై అధికారిక క్లారిటీ త్వరలోనే రానుంది. ఇక ఈ చిత్రానికి రామ్ సోదరుడు కృష్ణ పోతినేని నిర్మాణం వహిస్తుండగా ఈ డిసెంబర్ బరిలో సినిమాని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.




# డాక్టర్ బాబు అయ్యాడు మారథాన్ రన్నర్

## రెండేళ్లలోనే ఆసియా గేమ్స్‌కు..



చిన్నప్పటి నుంచి అథ్లెట్ కావాలనే కల.. కుటుంబ సభ్యులు మాత్రం చదువుకుంటేనే భవిష్యత్తు బాగుంటుందని నచ్చజెప్పారు. సరే.. వారి మాటకు విలువనిచ్చి మెడిసిన్ చదివేందుకు విదేశాలకు వెళ్లాడు. అనుకోకుండా మొదలుపెట్టిన రన్నింగ్.. తనలోని అథ్లెట్‌ను నిద్రలేపింది. ఓ వైపు చదువు పూర్తై డాక్టర్ అయినా.. మారథాన్ రన్నర్‌గా మారిపోయాడు. తొలిసారి ఆసియా గేమ్స్‌లో అడుగుపెట్టిన ఆర్థోపెడిక్ సర్జన్ కార్తిక్ కార్కేరా స్ఫూర్తివంతమైన స్టోరీ ఇది.

**రష్యాలోనే బీజం..**

ముంబయికి చెందిన 29 ఏళ్ల కార్తిక్ వైద్యవిద్య కోసం 2016లో రష్యా వెళ్లాడు. ఆ తర్వాత మూడేళ్లపాటు రన్నింగ్ వైపు దృష్టిపెట్టలేదు. ఎప్పుడైతే కరోనా విజృంభించిందో కార్తిక్‌కు కాలేజీకి వెళ్లే పనిలేకుండా పోయింది. ఆన్‌లైన్‌లోనే చదవాల్సిన పరిస్థితి. దీంతో ఫిట్‌నెస్ కోసం యూనివర్సిటీలోని 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్‌ను వినియోగించడం మొదలుపెట్టాడు. కొన్నిసార్లు రోజుకు దాదాపు 20 నుంచి 25 కి.మీల వరకూ ఒంటరిగానే పరుగుపెట్టేవాడు. 2021, 2022లో రష్యా యూనివర్సిటీలో 1500 మీటర్ల రన్నింగ్ పోటీల్లో పాల్గొన్నాడు. అందులో విజయం సాధించాడు. ఒలింపిక్ ఛాంపియన్ యురీ బోర్జాకోవిస్కీతో కలిసి పనిచేశాడు. దీంతో 2023లో మాస్కో హాఫ్ మారథాన్ (21కి)లో పోటీపడి ఆరో ప్లేస్ సాధించాడు. ఆ మరుసటి ఏడాదే అతడు భారత్‌కు తిరిగి వచ్చాడు. అప్పటికి ఇతని గురించి ఇక్కడెవరికీ పెద్దగా తెలియదు.

**కేవలం రెండేళ్లలోనే..**

సంకల్పం ఉంటే ఎంతటిదానినైనా సాధించవచ్చని కార్తిక్ నిరూపించాడు. పెద్ద ఈవెంట్లలో పాల్గొనాలని చిన్నప్పటి నుంచే చాలా మంది తర్ఫీదు పొందుతుంటారు. కానీ, కార్తిక్ పరిస్థితి భిన్నమైంది. దాదాపు 22 ఏళ్ల వయసులో మారథాన్‌లోకి అడుగు పెట్టిన అతడు.. డాక్టర్ పట్టా చేతబట్టుకొని ఇండియాకు వచ్చాడు. రష్యాలో పలు మారథాన్లలో పాల్గొన్నా.. ఇక్కడి వచ్చాక నాశిక్‌లోని ఓ ఆసుపత్రిలో రెసిడెంట్‌గా చేరాల్సి వచ్చింది. తన షిఫ్ట్‌లను బ్యాలెన్స్ చేసుకుంటూనే మారథాన్ ట్రైనింగ్‌లో పాల్గొనేవాడు. అందుకోసం నిద్రనూ త్యాగం చేసిన సందర్భాలు అనేకం. అతడు పడిన శ్రమకు ప్రతిఫలం రెండేళ్లలోనే వచ్చింది. దిల్లీ మారథాన్‌ను 2:13:10 గంటలు, టాటా ముంబయి మారథాన్‌ను 2:19:55 గంటల్లో పూర్తి చేసి బెస్ట్ రన్నర్‌గా పేరొందాడు. ఆ రేసుల తర్వాత భారత మారథాన్‌లో కొత్త స్టార్ వచ్చాడని తెలిసింది.

"నేనేదో ఓవర్‌నైట్ స్టార్‌గా మారిపోయానని చాలా మంది భావిస్తారు. కానీ, దాదాపు పదేళ్ల కష్టం దాగి ఉంది" – కార్తిక్

**కెన్యాలో ట్రైనింగ్ అయి..**

కార్తిక్ మారథాన్ సత్తాను గమనించిన రిలయన్స్ ఫౌండేషన్ అతడికి మద్దతుగా నిలిచింది. అడిడాస్‌తోనూ కార్తిక్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. కెన్యాకు వెళ్లి అక్కడ ఉండే అత్యుత్తమ మారథాన్ రేసర్లతో ట్రైనింగ్ తీసుకున్నాడు. ఫిట్‌నెస్ నిరూపించుకోవాలని అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సూచన మేరకు భువనేశ్వర్ వచ్చిన అతడు.. 5కే రన్‌ను 15:07.49 నిమిషాల్లో పూర్తి చేశాడు. దీంతో కార్తిక్ ఆసియా క్రీడల్లో పాల్గొనడం ఖాయమైంది. సెప్టెంబర్ 26న తన కెరీర్‌లో తొలిసారి ఆసియా గేమ్స్‌లో 42 కి.మీ మారథాన్‌లో పోటీపడనున్నాడు.

# గంగూలీ బయోపిక్ షూటింగ్..

## ఇంగ్లాండ్ క్లబ్‌కు రూ.6 లక్షలు జరిమానా



ఇంగ్లాండ్‌లోని ఓ కౌంటీ క్లబ్‌కు పడిన జరిమానాకు పరోక్షంగా భారత మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ బయోపిక్ షూటింగ్ కారణమైంది. దాదాపు రూ. 6 లక్షల జరిమానాతోపాటు 27 పాయింట్ల కోత పడింది. గత ఆగస్టులో కౌంటీ ఛాంపియన్‌షిప్ మ్యాచ్ సందర్భంగా పిచ్ నాణ్యత దారుణంగా ఉందని తాజాగా రిపోర్ట్ వచ్చింది. లీసెస్టర్‌షైర్ – గ్లామోర్గాన్ జట్ల మధ్య డివిజన్ 1 మ్యాచ్ జరిగింది. గ్లామోర్గాన్‌పై లీసెస్టర్‌షైర్ 42 పరుగుల తేడాతో విజయం సాధించింది. కానీ, పిచ్ అత్యంత దారుణంగా ఉందని కౌంటీ క్రమశిక్షణ ప్యానెల్ 'పూర్' రేటింగ్‌ను ఇచ్చింది. అయితే, పిచ్‌ను సరిగ్గా సిద్ధం చేయలేకపోవడానికి పలు కారణాలు ఉన్నాయని గ్రౌండ్స్‌మన్ కాల్లమ్ లూయిన్ తెలిపారు. తొలుత షెడ్యూల్‌లో లేని బాలీవుడ్ సినిమా చిత్రీకరణ కూడా ఒక అంశమని వెల్లడించారు. "ఆ మ్యాచ్‌కు పది వారాల ముందు రెండు టీ20లు జరిగాయి. దీంతో డివిజన్ 1 మ్యాచ్ కోసం ఈ పిచ్‌నే వాడాం. ఆ సమయంలో వాతావరణం కూడా చాలా ఇబ్బంది పెట్టింది. దాదాపు 35 డిగ్రీల ఎండ ఉంది. అనుకోకుండా బాలీవుడ్‌కు చెందిన ఓ సినిమా చిత్రీకరణ కూడా ఈ మ్యాచ్‌కు నాలుగు రోజుల ముందే ఇక్కడ జరిగింది. దీంతో పిచ్‌మీద పని చేసేందుకు నన్ను అనుమతించలేదు. కనీసం కవర్ చేయడానికీ అవకాశం లేకుండా పోయింది" అని లూయిన్ తెలిపారు. గ్రౌండ్‌మన్ చెప్పిన సినిమా గంగూలీ బయోపిక్ అని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. కమిటీ నిర్ణయంపై అప్పీలు చేసుకొనేందుకు లీసెస్టర్‌షైర్‌కు 10 రోజుల సమయం ఉంది. తప్పకుండా దీనిపై రివ్యూ చేయమని కోరతామని క్లబ్ వెల్లడించింది.

# 30 బంతుల్లోనే సెంచరీ.. అభిషేక్ శర్మ రికార్డు



అఫ్గానిస్థాన్‌తో జరుగుతున్న మూడో టీ20లో భారత ఓపెనర్ అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడాడు. 30 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేశాడు. ఇందులో 96 పరుగులు .. 10 సిక్సులు, 9 ఫోర్ల రూపంలోనే రావడం గమనార్హం. మొత్తంగా అంతర్జాతీయ టీ20ల్లో ఇది మూడో ఫాస్టెస్ట్ సెంచరీ. తొలి రెండు స్థానాల్లో వరుసగా ఎస్టోనియాకు చెందిన సాహిల్ చౌహాన్ (27 బంతులు), టర్కీకి చెందిన ముహమ్మద్ ఫహాద్ (29 బంతులు) ఉన్నారు. భారత జట్టు పరంగా చూస్తే ఇది ఫాస్టెస్ట్ సెంచరీ. అంతకు ముందు 2017లో రోహిత్ శర్మ శ్రీలంకతో మ్యాచ్‌లో 35 బంతుల్లో సెంచరీ చేశాడు.

**పవర్ ప్లే రికార్డు కూడా...**

అదే విధంగా టీ20 పవర్ ప్లేలో అత్యధిక పరుగుల రికార్డును అభిషేక్ శర్మ– సంజు శాంసన్ జోడీ బద్దలుకొట్టింది. తొలి ఆరు ఓవర్లలో 100 పరుగులు చేసింది. భారత టీ20 క్రికెట్‌లో ఇదే అత్యధికం. 2025లో ఇంగ్లాండ్‌పై చేసిన 95/1 ఇప్పటివరకు మన టాప్ పవర్ ప్లే స్కోర్. మొత్తంగా చూస్తే.. ఈ రోజు పవర్‌ప్లేలో సాధించిన స్కోరు మూడో అత్యధికం. తొలి రెండు స్థానాల్లో 113/0, 102/0 ఉన్నాయి.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com